వైయస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక వార్త

సోమవారం 07 ఏప్రిల్ 2025


## కోదండరామస్వామి వారి కళ్యాణానికి ఆహ్వానం

### మంత్రిను ఆహ్వానించిన శ్రీ కోదండరామస్వామి ఆలయ కమిటీ అర్చక స్వాములు

చిన్నమండెం, ఏప్రిల్ 6 ప్రభాత వార్త :



ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి వారి కళ్యాణానికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తప్పక హాజరు కావాలని శ్రీ కోదండరామస్వామి వారి ఆలయ కమిటీ అర్చక స్వాములు ఆదివారం మంత్రి నివాసం నందు ఆహ్వాన పత్రిక అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా అర్చక స్వాములు మాట్లాడుతూ ఈనెల 6వ తేదీ నుంచి 15వ తేదీ వరకు శ్రీ కోదండరామస్వామి వారి బ్రహ్మోత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏప్రిల్ 11,వ తేదీ శుక్రవారం రాత్రి స్వామి వారి కళ్యాణం నిర్వహించడం జరుగుతుందని కళ్యాణానికి తప్పక హాజరు కావాలని వారు కోరారు. ఇందుకు స్పందించిన మంత్రి స్వామివారి కళ్యాణానికి హాజరు అవుతానని వారికి తెలిపారు.

## పెండ్లిమర్రిలో వైభవంగా శ్రీరామనవమి

పెండ్లిమర్రి, ఏప్రిల్ 5, ప్రభాతవార్త:



మండలంలోని పెండ్లిమర్రి, చీమలపెంట, చెన్నమరాజుపల్లె, కొండూరు తదితర గ్రామాల్లో ఆదివారం శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సీతారాముల ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. చీమలపెంట గ్రామంలో శ్రీరామ నవమిని పురస్కరించుకొని బండలాగుడు పోటీలు నిర్వహించి గెలుపొందిన ఎద్దుల యజమానులకు బహుమతులు ప్రదానం చేశారు.

# ఒంటిమిట్టలో వైభవంగా ధ్వజారోహణం



నేస్తమా మత హారతి ఇస్తున్న పురోహితులు

రాజంపేట అర్బన్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త

ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం ధ్వజారోహణంతో శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం వృషభ లగ్నంలో పాంచరాత్ర ఆగమశాస్త్ర బద్ధంగా గరుడపటాన్ని ప్రతిష్టించి శాస్త్రోక్తంగా ధ్వజారోహణ ఘట్టం నిర్వహించారు. కంకణబట్టర్ రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముందుగా గరుడ ధ్వజపటాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి గరుడ ప్రతిష్ట, ప్రాణప్రతిష్ట, నేత్రోత్మీలనం నిర్వహించారు. ధ్వజస్తంభానికి నవకలశ పంచామృతాభిషేకం చేసారు.రాగతాళ నివేదన ద్వారా ఇంద్రాది సకలదేవతలను, నవగ్రహాలను, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా వేదపండితులు చతుర్వేద పారాయణం చేశారు.



గ్రామోత్సవానికి బయలుదేరే ముందు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



ఒంటిమిట్టలో ధ్వజారోహణం దృశ్యం

## భారీ అన్నదాన కార్యక్రమం



రాయచోటి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త

శ్రీ సీతారాముల కళ్యాణం సందర్భంగా మండిపల్లి నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాయచోటి పట్టణం, ఎన్జీవో కాలనీలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శ్రీ సీతారాముల కల్యాణానికి జిల్లా నలుమూలల 6 వేల పై చిలుకు మంది భక్తులు హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రత్యేక అలంకరణలతో స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు, రాయచోటి నియోజకవర్గ ప్రజలకు, ప్రతి ఒక్కరికి శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేశారు.

## శేష వాహనంపై విహరించిన కోదండ రాముడు

రాజంపేట అర్బన్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త

ఒంటిమిట్ట శ్రీరామ బ్రహ్మోత్సవాలలో మొదటి రోజు ఆదివారం రాత్రి కోదండరాముడు శేష వాహనంపై పురవీధుల్లో విహరించారు. ఉదయం ద్వజారోహణం సందర్భంగా ప్రత్యేక పూజలు అందుకున్న ఉత్సవమూర్తులను రాత్రి మరల ప్రత్యేక పూజల అనంతరం శేష వాహనంపై కొలువుదిరి భక్తులకు దర్శనమిచ్చారు. పురవీధులలో జై శ్రీరామ్ నామస్మరణ మధ్య శేష వాహనంపై సీతారామలక్ష్మణులు గ్రామ పురవీధుల్లో , మాడవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం వెంట కార్యక్రమాలు భక్తులను అలరించాయి.



## పెద్దశేష వాహనంపై శ్రీరామచంద్రుడు విహారం

వాల్మీకిపురం, ఏప్రిల్ 06 ప్రభాతవార్త:



వాల్మీకిక్షేత్రంలోని శ్రీ పట్టాభి రాముడి బ్రహ్ముత్సవాల్లో భాగంగా నాల్గొవ రోజు ఆదివారం రాత్రి 8గంటలకు స్వామివారు పెద్దశేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం సుప్రభాత సేవతో స్వామివారికి మేల్కొలిపి శుద్ధి, తోమాలసేవ, పంచాంగ శ్రవణం, కొలువు, అర్చన అనంతరం ఉదయం 8 గంటలకు సర్వభూపాల వాహనం తిరుమాఢవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. వాహన సేవ అనంతరం స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. సాయంత్రం ఊంజల మండపంలో శాస్త్రోక్తంగా ఊంజల్ సేవ నిర్వహించారు. రాత్రి 8గంటలకు పెద్దశేష వాహనసేవ కోలాహలంగా సాగింది. స్వామివారు పెద్దశేష వాహనాన్ని అధిరోహించి ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. మహిళలు పెద్దశేష వాహనంపై ఊరేగుతున్న స్వామివారికి నేతి దీపాలతో తిరుమాడ వీధుల్లో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టిటిడి అధికారులు, ఆలయ అధికారి క్రిష్ణమూర్తి, సిబ్బంది నాగరాజ, అర్చకులు క్రిష్ణప్రసాద్ భట్టర్, క్రిష్ణరాజు భట్టర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### శ్రీరామనవమి పర్వదినాన

## నృత్యాలతో అలరించిన చిన్నారులు

కడప కార్పొరేషన్ ఏప్రిల్ 6 ప్రభాతవార్త:

ఉగాది, శ్రీరామనవమి పండుగలను శిల్పారామంలో ఘనంగా నిర్వహించినట్లు శిల్పారామం పరిపాలన అధికారి ఎస్ కృష్ణ ప్రసాద్ చెప్పారు. అలాగే శిల్పారామం లో కొత్తగా లండన్ బస్ ఏర్పాటు చేసామన్నారు. ఫన్నీ హారర్ ను ఏర్పాటుచేసి కడప నగర ప్రజలకు అందుబాటులో తెచ్చామన్నారు. శ్రీరామ నవమి పండుగ సందర్భంగా ఆదివారం కడప శిల్పారామంలో వడపప్పు, పానకము సందర్శకులకు పంపిణీ చేశారు. సా. 6 గం.లకు కడప స్ప్రౌట్ వాలి ఇంటర్నేషనల్ స్కూల్ వారిచే సాంస్కృతిక కళావేదికపై స్కూల్ విద్యార్థులు సాంప్రదాయ వస్త్రధారులతో చూడ ముచ్చటగా తమ స్టెప్పులతో ప్రేక్షకులును అలరింపజేశారు. గోదావరి గట్టు మీద రామచిలకవే, రారా కృష్ణ ముకుందామా, గొబ్బియాలో గొబ్బియాలో వంటి పాటలు స్టెప్పులు వేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ సూపర్వైజర్ పి.మధుసూదన్ బాబు, వీక్షకులు సందర్శకులు పాల్గొన్నారు.




## జిల్లా షూటింగ్‌బాల్ సబ్‌జూనియర్ జట్లు ఎంపిక

మదనపల్లె, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :




అన్నమయ్య జిల్లా షూటింగ్‌బాల్ సబ్‌జూనియర్స్ జిల్లా జట్లు ఎంపిక చేసినట్లు జిల్లా కార్యదర్శి గౌతమి తెలిపారు. ఆదివారం పట్టణంలోని నిమ్మనపల్లె రోడ్డు బైపాస్ రోడ్డులో ఉన్న ప్రైమ్‌స్పోర్ట్స్ ఐనాలో సబ్‌జూనియర్ జిల్లా షూటింగ్‌బాల్ బాల బాలికల జట్లు ఎంపిక చేసినట్లు ఆమె తెలిపారు. ఎంపికైన జిల్లా జట్టు ఈనెల 26, 27వ తేదీల్లో వశిష్ట, సిబిఎస్ పాఠశాలలో జరిగే రాష్ట్ర షూటింగ్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే తనయుడు జునైద్ అక్బరీ ఎంపికైన క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో గెలిపొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ జిల్లాల షూటింగ్‌బాల్ కన్వీనర్ నరేష్‌బాబు, కార్యదర్శి మురళి, కోచ్‌లు ఉదయ్, మురళి, పీడిలు బాషా, శివశంకర్‌లు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

### పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, నాయకులు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :

నియోజకవర్గంలో ఆదివారం శ్రీరామనవమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. నియోజకవర్గంలోని పలు రామాలయాల్లో శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ పూజల్లో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చిప్పిలి, సొసైటి కాలనీలోని రామాలయం, ఎన్‌టిఆర్ సర్కిల్, నీరుగుట్టవారిపల్లె, అమ్మినేని వీధిలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో జరిగిన ఉత్సవాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సీతారాముల కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈ ఉత్సవాల్లో వైకాపా నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్, తెలుగుయువత అధ్యక్షులు శ్రీరామ్‌చినబాబు, కురవంకలో జరిగిన శ్రీరామనవమి ఉత్సవాల్లో సర్పంచ్ పసుపులేటి చలపతి పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అదే విధంగా వాల్మీకిసంఘం నాయకులు ఆధ్వర్యంలో శ్రీరామనవమి సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. వరాల ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. రింగ్‌రోడ్డు, నీరుగట్టువారిపల్లె, ఎన్‌టిఆర్ సర్కిల్, ప్రశాంత్‌నగర్ బోర్డు వద్ద శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించి భక్తులకు పాణకంతో పాటు అన్నదాన కార్యక్రమం చేశారు.

## మాజీ డిప్యూటీ సీఎం సోదరుడు అరెస్టు

కడప, ఏప్రిల్ 6 ప్రభాత వార్త



మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ భాష సోదరుడు అహ్మద్ అరెస్టు అయ్యారు. ఆయనపై లుక్ ఔట్ నోటీసులు ఉండడంతో ముంబై ఎయిర్పోర్టులో ఇమ్మిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకుని కడప పోలీసులకు అప్పగించారు. టిడిపి ఎమ్మెల్యే మాధవిరెడ్డిని దూషించారని ఆరోపణల్లతో ఆయనపై కేసు నమోదైంది. ఓ స్థలం విషయ్యంలోనూ దాడి కేసు ఉన్నట్లు సమాచారం. ఈ కేసులో ఇరువర్గాలు రాజి పడినప్పటికీ కక్ష సాధింపులో భాగంగా అరెస్ట్ చేసినట్లు వైసీపీ వర్గాలు ఆరోపిస్తున్నాయి.

# కోట్ల కమిషన్ కోసమే గత ప్రభుత్వం దృష్టి

- సామాగ్రిని స్టేడియం నుంచి తరలిస్తే ఒప్పుకోం
- ఏసీఏ నిధులు మంజూరు చేసిన పూర్తి చేయని వైనం
- పనులనాణ్యత పై దృష్టి పెట్టని వైకాపా నేతల
- ఇచార్జ్ తో కలిసి సీఎం దృష్టికి తీసుకెళ్లి పనులు పూర్తి చేస్తాం
- మాజీ పట్టణ అధ్యక్షులు మద్దూరి వెంకట్రామిరెడ్డి



పులివెందుల, ఏప్రిల్6 ప్రభాతవార్త:

కోట్ల రూపాయల కమిషన్ కోసమే గత ప్రభుత్వం దృష్టి పెట్టింది తప్ప చేపట్టిన నిర్మాణ పనులు పూర్తి చేయడం పట్ల శ్రద్ధ వహించలేదు అని పులివెందులలో వైయస్సార్ క్రికెట్ స్టేడియం నుంచి సామాగ్రిని తరలించవద్దని టీడీపీ మాజీ పట్టణ అధ్యక్షులు మద్దూరి వెంకట్రామిరెడ్డి అన్నారు.పులివెందుల పట్టణంలో గత ప్రభుత్వం హయంలో ఏసీఏ ఆధ్వర్యంలో వైయస్సార్ క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టింది.అయితే కాంట్రాక్టు నిర్లక్ష్యంతో పనులు పూర్తి కాలేదు. అయితే ప్రభుత్వం మారడం , ఏసీఏ సంఘం మారడంతో వైఎస్ ఆర్ క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులు మరుగున పడ్డాయి. దీంతో ఇక్కడ నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టరు సరిగా స్పందించక పోవడం,ఇక్కడ గత ప్రభుత్వం హయంలో నియమించిన కార్మికులు సరిగా స్పందించక పోవడంతో ఇక్కడ ఉన్న సామాగ్రినీ ఏ సి ఏ స్ట్రక్చరల్ అనాలసిస్ సెక్రెటరీ విజయ్ కుమార్ ఆదేశాలతో పులివెందుల లోని వైయస్ క్రికెట్ స్టేడియం నుంచి సామాగ్రిని ఇక్కడ సిబ్బంది తరలిస్తున్న విషయం తెలిసిన వెంటనే వెంకట్రామిరెడ్డి స్టేడియం వద్దకు వెళ్లి సామాగ్రిని తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకొని ఇంచార్జి దృష్టికి తీసుకెళ్లి అలాగే సంబంధిత అధికారులతో మాట్లాడి సామాగ్రిని తరలించవద్దు అని వారిని ఆయన కోరారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏసీఏ నుంచి నిధులు మంజూరు చేసిన గత ప్రభుత్వంలో పనులు చేపట్టిన కాంట్రాక్టర్ పనులు పూర్తి చేయలేదన్నారు. గత ప్రభుత్వం పాలకులు కూడా కాంట్రాక్టర్‌తో కమీషన్ తీసుకోవడం వలన కాంట్రాక్టర్ పనులు పూర్తి చేసుకున్న పట్టించుకోలేదు అని కేవలం కమీషన్ కోసమే పనులు ప్రారంభించింది తప్ప పూర్తి చేయలేదన్నారు. మాజీ సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పులివెందులలో స్టేడియం నిర్మాణానికి శ్రీకారం చుట్టడం మంచి విషయం అని కానీ అవి కేవలం 90 నిధులు మంజూరు అయిన పనులు మాత్రం 60 అయ్యాయి అన్నారు. వీటిని తరలించ వద్దు అని క్రికెట్ స్టేడియం పూర్తి చేసి పులివెందులకు తలమాణికంగా నిలబెడతాం అన్నారు. మా ఇన్చార్జ్ బీటెక్ రవితో కలిసి సీఎం దృష్టికి తీసుకెళ్లి పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తామ న్నారు. సామాగ్రిని దొంగలిస్తున్నారని అందుకే భద్రత కోసం బయటికి తరలిస్తున్నామని ఏసిఏ అధికారులు తెలపడంతో సామాగ్రి భద్రత నా బాధ్యత అని వెంకట్రామిరెడ్డి వారికి తెలిపి తనే స్వయంగా తరలించడానికి సిద్ధంగా వాహనానికి నింపిన సామాగ్రిని దింపించి ఒక గదిలో వాటిని పెట్టించి భద్రతా బాధితులను తీసుకున్నారు.

**పార్టీలకు అతీతంగా వెంకట్రామిరెడ్డికి ప్రశంసల వెల్లువ**

టీడీపీ మాజీ పట్టణ అధ్యక్షులు మద్దూరి వెంకట్రామిరెడ్డి ఆదివారం వైయస్సార్ క్రికెట్ స్టేడియం నుంచి సామాగ్రిని తరలిస్తున్నారని తెలుసిన వెంటనే స్టేడియం వద్దకు చేరుకుని వాహనాన్ని ఆపి ఇన్చార్జి దృష్టికి తీసుకెళ్లి సంబంధిత ఏసి ఏ కమిటీ సభ్యులతో మాట్లాడి సామాగ్రిని తరలించకుండా నిలుపుదల చేసి స్టేడియం నిర్మాణ పనులను సీఎం దృష్టికి తీసుకెళ్లి పూర్తి చేసేలా చేస్తామని, స్టేడియం పులివెందుల తలమానికమని ఇక్కడ చిన్నారులలో క్రీడల్లో రాణించేందుకు మంచి అవకాశంగా ఉంటుందని కావున స్టేడియాన్ని తప్పకుండా పూర్తి చేస్తామని హామీ ఇవ్వడంతో పులివెందుల వాసులు క్రీడాభిమానులు పార్టీలకతీతంగా వెంకట్రాంరెడ్డి చూపిన చొరవను ప్రశంసిస్తున్నారు.



సామాగ్రిని వాహనం నుంచి దింపిస్తున్న దృశ్యం

## బిజెపి ఆవిర్భావ దినోత్సవం

(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)



రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు పోతు గుంట రమేష్ నాయుడు ఆ ధ్వర్యంలో ఆదివారం ఘనంగా 45వ బిజెపి పార్టీ ఆవిర్భావ దినో త్సవం జరిగింది. రాజం పేటలోని పాత బస్టాండ్ కూడలి, ఆర్ఎస్ రోడ్ లోని సమద్ థియేటర్ సర్కిల్ దగ్గర, వైబియన్ పల్లి లో పోతుగుంట రమేష్ నాయుడు ఆధ్వర్యంలో మూడు చోట్ల బీజేపీ జెండాను ఆవిష్కరించడం జరి గింది. అనంతరం కార్యకర్తలకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా రమేష్ నాయుడు మాట్లాడుతూ పార్టీకోసం తమ జీవితాలను త్యాగం చేసిన నాయకులు మరియు కార్యకర్తలందరినీ స్మరణ చేసుకుంటూ కార్యకర్తలందరికీ "పార్టీ ఆవిర్భావ దినోత్సవ"శుభాకాంక్షలు పోతుగుంట రమేష్ నాయుడు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతి నిధి పట్టుపోగుల ఆదినారాయణ, పట్టణ అధ్యక్షులు వివి రమణ, బిజెపి మైనార్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు షబ్బీర్ అహ్మద్, బిజెపి జిల్లా ప్రధాన కా ర్యదర్శి పి కృష్ణ, బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టీ పా పయ్య, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమణయ్య, గాదెల శ్రీనివా సులు, పట్టణ ప్రధాన కార్యదర్శిలు జికె నాగరాజు, బీజేవైఎం మండల అ ధ్యక్షులు పత్తిపాటి నవీన్ కుమార్, బిజెపి మండల ఉపాధ్యక్షులు సుబ్ర హ్మణ్యం నాయుడు, బిజెపి పట్టణ ఉపాధ్యక్షులు లోకేష్, బిజెపి నాయకులు రితేష్ నాగేశ్వర్ చౌదరి, రమణ, వెంకటసుబ్బయ్య, సుబ్రహ్మణ్యం తదిత రులు పాల్గొన్నారు.

## ఫార్మసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడుగా యునస్

సుండుపల్లి, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:



ఫార్మసి సంక్షేమ సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షు డుగా షేక్ యూనస్ నియమించబడ్డారు. యునస్ వి లేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఫార్మాసిస్టుల సంక్షే మానికి కృషి చేస్తానన్నారు. జిల్లా అధ్యక్షుడుగా నియ మించినందుకు చైర్మన్ సురేశ్ బాబుకు రాష్ట్ర అధ్యక్షులు లుక్కా నరేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఫార్మసీ చట్టం ప్రకారం ప్రతి మందుల షాపులలో ఫార్మసిస్ట్ తప్పనిసరిగా ఉండాలని, 1948 సెక్షన్ 19 ప్రకారం ప్రతి 5 సంవత్సరాలకొకసారి ఎలక్షన్స్ జరిపించాలని, స్వతహాగ మెడికల్ స్టోర్ పెట్టుకొనే ఫార్మసిస్టలకు సబ్సిడీతో కూడిన రుణా లకోసం ప్రభుత్వానికి విన్నవిస్తానని, ఫార్మా డి వారిని క్లినికల్ ఫార్మసిస్టుగా గుర్తించిన ప్రభుత్వం పీహెచ్‌సి, సిహెచ్‌సిలలో ఉద్యోగాలకోసం పోరాడతానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోర్ కమిటీ సభ్యులు సంతోష్, కృష్ణవేణి, నాగజ్యోతి, రాధాకృష్ణ, మహేశ్వరరావు, హేమంత్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

## భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం

సుండుపల్లి, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:



మండల పరిధిలోని బస్ షెల్టర్ దగ్గర బిజెపి మండల అధ్యక్షుడు రమణగౌడ్ ఆద్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమమునకు మండల సీనియర్ నాయకుడు రత్నాకర్ నా యుడు, అసెంబ్లీ కన్వీనర్ రామా జగదీష్, మాజీ మండల అధ్యక్షుడు నాగరాజా, రాసరా యుడు, వెంకటరామరాజు, సుబ్బరాజు, గోపా లరాజు, సత్యం నాయుడు, సుబ్బరామరాజు, రెడ్డి ఆచారి, డీజే వైఎం శివశంకర్ పాల్గొన్నా రు. రాష్ట్ర పార్టీ సూచన మేరకే 6 ఏప్రిల్ భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకోవడం జరిగిందన్నారు.

## ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రొద్దుటూరు ఏప్రిల్ 06, ప్రభాతవార్త



వైఎంఆర్ కాలనీలో ని పట్టణ అధ్యక్షులు వంకధార నరేంద్ర కా ర్యాలయంలో బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించా రు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు వం కదార నరేంద్రరావు భారతీయ జనతా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనం తరం నూతనంగా పార్టీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి బిజెపి నేతలు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరుసగా మూడవ సారి దేశంలో బీజేపీ అధికారంలోకి రావడం జరిగిందన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద పార్టీగా బిజెపి ఆవిర్భవించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మహిళా నేత సివి జయలక్ష్మి, విహెచ్పి మల్లికార్జునరావు, ప్రధాన కా ర్యదర్శులు చెన్నా మోహన్, ముత్యాల శ్రీశ్రీ, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర ప్రసా ద్, రవి ప్రకాష్ ఆర్ రెడ్డి ప్రసన్న, కుమారి, శివశక్తి పుల్లారెడ్డి, సుంకు గురు ప్రసాద్ ప్రధాన కార్యదర్శి విక్రమ్, గో సంరక్షకులు శివ నాగిరెడ్డి, జాతీయ నాయకులు వై నరేష్ కుమార్ యాదవ్, సినియర్ నాయకులు పరమేష్ రావు మరియు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అట్టహాసంగా భాజపా జెండా ఆవిష్కరణ

వీరపునాయునిపల్లి, ఏప్రిల్6, ప్రభాత వార్త:


జెండా ఆవిష్కరణ చేస్తున్న భాజపా నేతలు

మండల కేంద్రంలో బిజెపి మండల అధ్య క్షుడు గంగినేని తుల సినాయుడు ఆధ్వర్యం లో బిజెపి ఆవిర్భావ ది నోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ కా ర్యక్రమం అట్టహాసంగా జరిగింది ముఖ్యఅతిథి గా పాలెం సురేష్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నేషన్ ఫ స్ట్ పార్టీ సెకండ్ సెల్ఫ్ లాస్ట్ అనే నినాదంతో ముందుకు వెళుతూ అం త్యోదయ సిద్ధాంతాన్ని ఆధారంగా పనిచేస్తూ పార్టీ రెండు ఎంపీ సీట్లతో ప్రారం భమై నేడు 15 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నామంటే కోట్ల మంది కార్యకర్తలు నిబద్ధత జాతీయ భావం కారణంగానే అని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీని యర్ నాయకులు రామార్జునరెడ్డి, జిల్లా ఓబిసి అధ్యక్షులు ఏంవి ఆర్ నాయు డు, నరేష్ నాయుడు, గవేశ్వర్యాదవ్, మరియు ఇతర నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా భాజపా ఆవిర్భావ దినోత్సవం వేడుకలు

వేంపల్లి: ఏప్రిల్ 06 ప్రభాతవార్త:



భారతీయ జనతా పార్టీ అవిర్భావ ది నోత్సవాన్ని స్థానిక బీజేపీ నేతలు ఘ నంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ దగ్గర బీజేపీ జెండాను ఆవిష్కరణ చేసి స్వీట్లు పంపిణీ చేశా రు. అనంతరం ఏర్పాటు చేసిన సమా వేశం లో భాజపా జిల్లా ప్రధాన కార్య దర్శి గాలి హరి ప్రసాద్ మాట్లాడుతూ వికసిత భారత్ లక్ష్యంగా దేశ ప్రధాని నరేంద్ర మోడీ పనిచేస్తున్నారని అన్నా రు. ప్రపంచంలోనే అత్యధిక సభత్వం కలిగిన పార్టీ గా అవతరించిందని చెప్పారు. దేశంలో 4 వేల కిలోమీటర్లు వు న్న జాతీయ రహదారులను వాటి స్థాయి పెంచి 9 వేల కిలోమీటర్ల మేర నిర్మాణం చేయడం జరుగుతోందని చెప్పారు. ఈ కార్యక్రమం లో బీజేపీ మాజీ నేషనల్ కౌన్సిల్ సభ్యులు బొమ్మిరెడ్డి లక్ష్మిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు పి . సుస్మా, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు దొంతు సుమన్‌కుమార్, మండల శాఖ అధ్యక్షులు మొయిల్ల ఈశ్వర్‌రెడ్డి, యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సునీల్, మునగల చంద్ర, కంతూరి వెంకటేష్, శ్రీనివాసులు, మునగల వెంకట రమణ, ప్రసాద్ రెడ్డి, ప్రసాద్, శివ, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా శ్రీరామనవమి వేడుకలు



బద్వేలు అర్బన్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :

శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని పలు చోట్ల కన్నుల పండువగా శ్రీరామనవమి వేడుకలు మరియు సీతారాముల కళ్యాణం నిర్వహించారు. ఇందులో భాగంగాశ్రీకృష్ణదేవరాయనగర్, బీఎస్ఎన్ ఎల్ కార్యాలయం వద్ద అలాగే ఆంజనేయనగర్ ప్రసన్నాంజనేయ స్వామి దేవా లయం,గాండ్లవీధి, కోటవీధి, మడకలవారిపల్లె, బోవిళ్లవారిపల్లె, సుమిత్రానగర్, కొంగలవీడు, చెన్నంపల్లెతో పాటు పలు ఏరియాలలోఆలయ కమిటి మరియు దేవస్థాన నిర్వాహకుల ఆధ్వర్యంలో తెల్లవారుజామునుంచే ప్రత్యేక అభిషేకాలు హోమాలునిర్వహిస్తూ అన ంతరం సీతారాముల కళ్యాణం నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంకాలం. పలు ఏరియాలలో స్వామివారి గ్రా మోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ గ్రామోత్సవం వెంట సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

**నేత్రపర్వంగా సీతారాముల కళ్యాణోత్సవం:**

శ్రీరామనవమిని పురస్కరించుకుని శివానగర్‌లో వెలసిన శ్రీ కోదండరా మస్వామి ఆలయంలో ఆదివారం తెల్లవారుజామునుంచే ఆలయ ధర్మకర్త గోప య్య మరియు పలువురు కమిటి సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృ తాభిషేకం, కుంకుమార్చనతో పాటు వివిధ రకాల పూజలు నిర్వహించారు. అనంతరం సీతారాముల కళ్యాణోత్సవాన్ని కన్నుల పండువగా ట్రిబుల్ఆర్ విఎం గ్రూప్ఆఫ్ కంపెనీ చైర్మన్ రామనబోయిన మురళి యాదవ్‌తో పాటు సతీ మణి సునీత చేతుల మీదుగా కన్నుల పండువగా స్వామివారి కళ్యాణం నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో వేణు, నరసింహులుతోపాటు పలువురు కమిటి సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు. అనంతరం చైర్మన్ రామనబోయిన ము రళి మాట్లాడుతూ బద్వేలు పట్టణంలో వాడవాడలా కన్నుల పండువగా శ్రీరా మనవమి వేడుకలు జరుపుకోవడం సంతోషకరమని, యావత్ ప్రజలందరూ సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.



దేశ రక్షణే ధ్యేయంగా స్థాపితమై, ప్రజా సంక్షేమం, దేశ నిర్మాణం కోసం అంకితమై, కోట్లాది కార్యకర్తల సంఘీభావంతో ప్రపంచంలోని అతి పెద్ద రా జకీయ పార్టీగా అవతరించిన భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపక దినోత్స వం సందర్భంగా పార్టీకోసం తమ జీవితాలను త్యాగం చేసిన నాయకులు మరియు కార్యకర్తలందరినీ స్మరణ చేసుకుంటూ కార్యకర్తలందరికీ "పార్టీ ఆ విర్భావ దినోత్సవ"శుభాకాంక్షలు. జిల్లా పార్టీ అధ్యక్షులు సాయి లోకేష్ ఆదేశాల మేరకు పెనగలూరు మండల అధ్యక్షుడు రెడ్డి కృష్ణ రాయల్ గారి ఆధ్వర్యంలో 45వ ఆవిర్భవ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా గౌరవనీయులైన శ్రీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు మరియు మైనార్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు షబ్బీర్ అహ్మద్ అన్నమయ్య జిల్లా ప్ర ధాన కార్యదర్శి కృష్ణ యాదవ్ మండల పదాధికారులు కార్యకర్తలు అభి మానులు భారీ ఎత్తున తదితరులు పాల్గొన్నారు.

## వీడ్కోలు పలికిన ఎన్నారైలు..

సుండుపల్లి, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:



అరబ్ దేశమైన కువైట్లో ఉగాది సంబరాలకు వెళ్లిన మాజీ మంత్రి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కడప జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ రాజంపేట అసెంబ్లీ ఇన్చార్జ్ సుగవాసి సుబ్రహ్మణ్యంకు ఎన్నారైలు వీడ్కోలు పలికారు. గత మూడు రోజుల క్రితం అరబ్ దేశమైన కువైట్లో అబ్బ సీయాల ోని ఆస్పైర్ బి లింగోల్ పాఠశా లలో ఎన్ఆర్ఐలు బలిజ సంఘం నాయకులు కాపు సం ఘం నాయకులు ఉగాది సంబరాలు నిర్వహించారు ఈ కార్యక్రమా నికి వారిని ఆహ్వానించడంతోభీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తో పాటు రాజంపేట అసెంబ్లీ ఇన్చార్జ్ సుగవాసి సుబ్రహ్మణ్యం కువైట్‌కు తరలి వెళ్లారు అక్కడ వారికి ఘన స్వాగతం పలకడంతో పాటు తమ గ్రామాల్లోని సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లడంతో వాటిని పరిష్కరించే అందుకోసం కృషి చేస్తామన్నారు ఉగాది సంబరాలలో మన దేశ రాష్ట్ర గొప్పతనం సంస్కృతి సాంప్రదాయాల గురించి తెలియజేశారు. ఉగాది సంబరాలు ముగించుకుని శనివారం రాత్రి ఇండియాకు బయలుదేరారు. వారికి సుండుపల్లి మండలం ము దుంపాడు కందుల వాళ్ల పల్లెకు కు చెందిన సుగవాసి యువసేన కంచన రెడ్డి శేఖర్ పలువురు ఎన్నారైలు ,ఎన్డీఏ పార్టీ నాయకులు వీడ్కోలు పలికారు.

## వరకట్నం కోసం వేదింపు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

సుండుపల్లె, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:

వర కట్నం కోసం వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల వివరాల మేరకు మండల పరిధిలోని మాచి రెడ్డి గారి పల్లె గ్రామపంచాయతీ వంకబిడికి గ్రామానికి చెందిన మూడే లక్ష్మీదేవి అదే గ్రామానికి చెందిన నాగేంద్ర నాయక్‌తో గత 9 సంవత్సరాల క్రితం వివా హం చేసుకుంది. వరకట్నం కోసం తన భర్త తనను కొట్టి గాయపరిచి వేధిస్తు న్నాడని ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలియజేశారు.

## వైభవంగా సీతారాముల కళ్యాణం

బద్వేలు అర్బన్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :

పట్టణంలోని అమ్మవారిశాల వీధిలో వెలసి వున్న శ్రీ కోదండరామ స్వామి దేవాలయంలో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలను ఆలయ కమిటీ అధ్య క్షులు పేర్ల జనార్ధన్‌రావు, సెక్రటరి బచ్చు నాగేశ్వరరావు , జాయింట్ సెక్రటరీ వల్లంకొండు సత్యనారాయణ, విశ్వనాథం శ్రీరాములు,ఉపాధ్యక్షులు తులసి సుబ్రమణ్యం, కోశాధికారి కొండపల్లి సాయి కుమార్, గౌరవ అధ్యక్షులు కొం డపల్లి చిన్న సుబ్బారావు, రిటైర్డ్ ఉపాధ్యాయులు శ్రీరాములు, నాగరాజ, య లకంటి సుబ్బరాయుడు, పబ్బతి చక్రపాణి, తోటంశెట్టి సతీష్, బ్రహ్మదండు వెంకటసుబ్బయ్య, పాటు పలువురు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో తెల్లవా రుజాము నుండే స్వామివారికి వివిధ రకాల ప్రత్యేక పూజలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ కార్యక్రమం కన్నుల పండువగా నిర్వహించారు. కళ్యాణ మహోత్సవంలో ప్ర త్యేక ఉభయదారులుగాఎస్ఆర్ఎన్‌బి రెసిడెన్సి యజమాని డాక్టర్ రాచపూడి దిలీప్ గుప్తా, సతీమణి హైమావతి, యల్లనూరు వెంకటరమణ, సతీమణి హేమమాళిని, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో వేద పండితుల తంగి వెం కటేశ్వర్లు, శర్మ, మంత్రోచ్చారణల మధ్య వైభవంగా నిర్వహించారు. స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని పట్టణంలోని ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు. భక్తులందరికీ ప్రత్యేక తీర్థ ప్రసాదాలు అందించారు.

**అమ్మవారిశాల కమిటి తరపున కళ్యాణవస్త్రాలు పంపిణీ :** శ్రీ కోదండ రామ స్వామి దేవాలయంలో శ్రీరామనవమి పురస్కరించుకుని ఆలయ కమిటి ఆధ్వ ర్యంలో నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవానికి ఆర్యవైశ్య వర్తక సంఘం కమిటి తరపున కళ్యాణ వస్త్రాలను అధ్యక్షులు కేవి.సుబ్బారావు, సెక్రట రీ నాగరాజ మరియు కమిటి సభ్యులు చేతుల మీదుగా అమ్మవారిశాల నుండి ప్రత్యేక బ్యాండు మేళంతో కోదండ రామస్వామి కమిటి సభ్యులకు కళ్యాణ వస్త్రాలు సమర్పించారు. అనంతరం పలువురు కమిటి సభ్యులకు కోదం డరామస్వామి దేవాలయ కమిటి సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి శాలు వాతో సత్కరించి స్వామివారి కళ్యాణ పట్టు వస్త్రాలను అందుకుని స్వామివారికి సమర్పించారు.

## అయార్లా రాష్ట్ర కమిటీ సభ్యులుగా సిగి చెన్నయ్య

రైల్వే కోడూరు ఏప్రిల్ 6 ప్రభాత వార్త



అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు కీ చెందిన సిగి చెన్నయ్య ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం కాకినాడ లో జరిగిన రాష్ట్ర కార్యకర్తల సమావేశం లో అఖల భారత వ్యవసాయ మరియు గ్రామీణ కార్మిక సం ఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గా ఎన్నికైన సిగి చెన్నయ్య మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా లో అఖిల భారత మరియు వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం.( అయార్లా) బలోపేతం చేసేందుకు నా శాయశక్తులా కృషి చేస్తామన్నారు.అలాగే నా మీద నమ్మకం ఉంచి సిపిఐ (ఎం ఎల్) లిబరేషన్ రాష్ట్ర న్యాకత్వం అలాగే అఖిల భారత వ్యవసాయ మరియు గ్రా మీణ కార్మిక సంఘం రాష్ట్ర నాయకత్వాలు ఈ బాధ్యతలు కట్టబెట్టినందుకు ధన్యవాదాలు తెలిపారు.

## భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం

బద్వేల్ అర్బన్ ఏప్రిల్ 06 ప్రభాతవార్త :



బద్వేల్ పట్టణంలోని ఎన్జీవో హోంలో భారతీ య జనతా పార్టీ ఆ విర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించా రు. బిజెపి బద్వేల్ ప ట్టణ కమిటీ అధ్యక్షుడు ధర్మిశెట్టి వెంకటసుబ్బ య్య రాయల్ ఆధ్వర్యంలో ముఖ్యఅతిథిగా బీజేవైఎం కడప జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్ పోరుమామిళ్ల రోడ్డులో జడ్పీ హైస్కూల్ గేట్ ఎదురుగా బిజెపి పార్టీ జెండాను ఆవిష్కరించారు. తదుపరి ఎన్జీవో హోమ్ లో స మావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ధర్మిశెట్టి వెంకటసుబ్బయ్య రా యల్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం కార్య క్రమాన్ని బద్వేల్ పట్టణంలో గర్వంగా నిర్వహించుకుంటున్నాం అని తెలి పారు. బొమ్మన విజయ్ మాట్లాడుతూ బిజెపి పార్టీ ఆవిర్భావానికి పునాది వేసిన మహనీయులు అటల్ బీహార్ వాజ్పేయి, లాల్ కృష్ణ అద్వానీ గారికి ధన్యవాదములు తెలుపుకుంటూ బిజెపి పార్టీ పేదల కోసం ఏర్పడిన పార్టీ. దేశాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తున్నటువంటి ఏకైక పార్టీ అని ఆయన తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రూరల్ అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, బద్వేల్ అసెంబ్లీ కన్వీనర్ బిజి వేముల భాస్కర్ రెడ్డి, ఉపాధ్యక్షురాలు కటారి కిరణ్ కుమారి, తుడిమెల్ల విజయలక్ష్మి,పట్టణ ప్రధాన కార్యదర్శి ముఖం. శ్రీనివాస్, ఆర్ఎస్ఎస్ సంఘసేవక్ రామకోటి రాజు, బిజెపి సీనియర్ నా యకులు కుప్పాలా నరసింహులు, వనం నరసింహులు, సుబ్బారెడ్డి, బిజెపి సోషల్ మీడియా ఇంచార్జ్ సంజీవరెడ్డి, కార్యదర్శి తిరుపతిరెడ్డి, వల్లే వారి పల్లె సుబ్బారెడ్డి, 32 వార్డు బీసీ కాలనీ ప్రజలు తదితరులు పాల్గొని కార్య క్రమాన్ని విజయవంతం చేశారు.

## మనుషులకు ఆదర్శం శ్రీరాముడు..

కడప కార్పొరేషన్ ఏప్రిల్ 6 ప్రభాతవార్త:



శ్రీరాముడు సమస్త మా నవాళికి ఆదర్శప్రాయు దాని విశ్వహిందూ పరి షత్ కడప జిల్లా అధ్య క్షుడు చెన్నకృష్ణారెడ్డి, కా ర్పొరేటర్ డివిజన్ ఇంచార్జ్ వి. రామకృష్ణారెడ్డి, కొత్తూరు సురేంద్ర లు ఉన్నారు. తండ్రీకొడుకులు, భా ర్యాభర్తలు, అన్నదమ్ములు, మిత్రులు, రాజుప్రజలు, వీరందరి మధ్య గలసం బంధబాంధవ్యములు, ప్రవర్తనా విధానములు రామాయణములో చెప్పబ డ్డాయన్నారు. ఆదివారం శ్రీరామనవమి పండుగ సందర్భంగా పత్తూరు బ్రద ర్స్ 12వ వార్షికోత్సవం సందర్భంగా పత్తూరు సురేంద్ర ఆధ్వర్యంలో కడప కాగితాలపెంటలో పానకము, వడపప్పు భక్తులకు పంచిపెట్టారు. భక్తులకు అ ల్పాహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సూర్యం, ఉల్లి శ్రీనివాసులు, శ్రీని వాస్, శ్రీరామ్ మురళి, హరీష్, చిన్న, మహిళలు భక్తులు పాల్గొన్నారు.

## మహిళపై హత్యాయత్నం కేసులో 6 మంది అరెస్ట్

ఖాజీపేట, ఏప్రిల్ 06, ప్రభాతవార్త:



మార్చి 31వ తేదీన ఖాజీపేట పిడబ్ల్యుడి బంగ్లా సమీపంలో ఉ న్న మహిళపై హత్యాయత్నం కేసులో 6మందిని అరెస్టు చేసి నట్లు ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ మోహన్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ఖాజీపేటలోని పిడబ్ల్యుడి బంగాళా దగ్గర నివాసముంటున్న మహిళ పైన ఆమె డ్రైవర్ శివకృష్ణల పైన కడపకు చెందిన కొందరు వ్యక్తులు దాడి చేసి డ్రైవర్ను గాయపరిచారు. ఫిర్యాదు దారు రాలు వ్యాపారంతో పాటు రియల్ ఎస్టేట్ మరియు పలు రకాల వ్యాపారాలు చేస్తుంది. ఈ క్రమంలో కడపకు చెందిన ఓబుల్ రెడ్డి అనే వ్యక్తికి దాదాపుగా 13 లక్షల డబ్బులు అప్పుగా ఇచ్చింది. డబ్బులు తిరిగి చెల్లించాలని కొంతకా లంగా ఓబుల్ రెడ్డిపై ఒత్తిడి చేస్తుంది. అయినప్పటికీ ఓబుల్ రెడ్డి డబ్బులు తిరిగి ఇవ్వలేదు. దీంతో సౌభాగ్య కడపలోని ఓబుల్ రెడ్డి ఇంటికి వెళ్లి తాళం వేసి వచ్చింది. దీనికి అవమానంగా భావించిన ఓబుల్ రెడ్డి సౌభాగ్యపై ప్రతీ కారం తీర్చుకోవాలన్న ఉద్దేశంతో కడప నుంచి 13 మంది వ్యక్తులను సౌభా గ్య ఇంటికి పంపించాడు. రాత్రి 10 గంటల సమయంలో ఆమె ఇంటి పైకి నిందితులు దాడి చేశారు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వెంటనే స్పందించి అందులో ఇద్దరిని పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. తర్వాత పోలీస్ విచారణలో ఇంకో నలుగురు నిందితులు కడ ప సమీపంలోని ఇర్కాన్ సర్కిల్ వద్ద సిఐ మోహన్ తన సిబ్బందితో వెళ్లి అ రెస్టు చేశారు. వారి వద్ద నుంచి హత్యాయత్నానికి ఉపయోగించబడిన రెండు కత్తులను, దాడికి ఉపయోగించిన మూడు మోటార్ సైకిల్ ను స్వాధీన పరు చుకున్నారు. దీనికి మూల కారణమైన ఓబుల్ రెడ్డి అతని తమ్ముడు సూర్య చంద్రారెడ్డి లతో పాటు మరో ఐదు మంది పరారీలో ఉన్నట్టు సిఐ మోహన్ తెలిపారు. త్వరలో వారిని సైతం పట్టుకుంటామని ఆయన తెలిపారు.

## మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు

సిద్దవటం, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:



జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చై ర్మన్ నాదెండ్ల మనోహర్ జన్మదిన సందర్భంగా ఆ యనకు రాజంపేట పార్లమెంటు సమన్వయకర్త అ తికారి కృష్ణ ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటంలో జ నసేన రాజంపేట పార్లమెంటు సమన్వయకర్త అతి కారి కృష్ణ మాట్లాడుతూ ఆదివారం తిరుపతిలో రాష్ట్ర మంత్రి పుట్టిన రోజు సందర్భంగా ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశామని పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన గు ర్తింపు రాష్ట్ర స్థాయిలో సముచిత న్యాయం జరుగుతుందని పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కారం కృషి చేషి చేయాలని మంత్రి తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో అతికారి చిన్న వెంకటయ్య, నర సింహ, జనసేన పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవం

కడప కార్పొరేషన్ ఏప్రిల్ 6 ప్రభాతవార్త:



దేశాన్ని సమర్థవంతంగా అభివృద్ధి పదం పై నడుపుతూ, 16 రాష్ట్రాల్లో సొంతంగా అ ధికారంలో ఉన్నది. కొన్ని రాష్ట్రాల్లో ఎన్డీఏ కూటమి అధికారంలో ఉన్నదని బిజెపి కడప జిల్లా అధ్యక్షులు జంగిటి వెంకట సుబ్బారెడ్డి అన్నారు. బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఆదివారం కడపలో భాజపా కా ర్యాలయంలో కమలం జెండాను ఎగరవేశా రు. అనంతరం వైసిపి నాయకులు డా.శివానాయక్, అశోక్ చక్రవర్తి లకు కండువా వేసి బిజెపి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణ యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లక్ష్మీనారాయణ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు భిరం సుబ్బారెడ్డి, బీజేవైఎం జాతీయ నాయకులు బత్తల పవ న్ కుమార్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు ప్రవీణ్ నాయుడు, జిల్లా కార్యదర్శి ఓబులయ్య, శ్రీకాంత్, సాయి, జిల్లా ఉపాధ్యక్షులు గజ్జల రామకృష్ణ రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పద్మావతి భాయ్, మైనారిటీ మోర్చా నాయకురాలు షకీలా బేగం, లక్ష్మణ్ రావు, ము నగ సతీష్, ప్రభు, శాలివాహన పాల్గొన్నారు.

## గ్రామ గ్రామాన శ్రీరామనవమి వేడుకలు

బ్రహ్మంగారిమఠం ఏప్రిల్ 06 ప్రభాతవార్త:



మండలంలో దశరథ త నయుడు ధర్మస్వరూపుడైన శ్రీరామచంద్రుడు అడిన మాట తప్పడు ఇచ్చిన మా ట మీద నిలబడే వ్యక్తి అని ఆయనకు నాలుగు ఇల్లు ఉ న్న చోట కూడా రామాల యం లేని ఊరు వుండదు ఈ శ్రీరామచంద్రుడు వేడుకలు సోమిరెడ్డి పల్లి,పాతూరు, కొత్తూరు, నరస న్నపల్లి, గ్రామగ్రామాన శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ శ్రీ సీతారాముల వారికి విశేష పూజలు అనంతరం వచ్చిన భక్తులకు పానకం వడపప్పు పంపిణీ కార్యక్రమం చేశారు.శ్రీ సీతారాముల కళ్యాణం వైభవంగా భక్తి శ్రద్ధలతో భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం రాత్రికి శ్రీ సీతారాముల వారిఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం ఊరేగింపు లో ప్రసాదం పంపిణీ చేస్తారు.అలాగే వచ్చిన భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.రామాలయాలను విద్యుత్ దీపాలంకరణలతో అలంకరించారు.

## మహిళ ఆత్మహత్య

మదనపల్లి క్రైమ్, ఏప్రిల్ 6 ప్రభాత వార్త.

కుటుంబ సమస్యలతో ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘ టన ఆదివారం మదనపల్లిలో చోటుచేసుకుంది. తాలుక సీఐ కళా వెంకటరమణ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లి పట్టణ శివారులోని కోళ్లబై లు గ్రామం జగన్ కాలనీలో నివాసం ఉన్న మహమ్మద్ అలీ భార్య సుమీ య(28) మధ్యాహ్నం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడగా, గమనించిన కుటుంబీకులు బాధితురాలిని వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షించగా అప్పటికే మృతి చెందిన్నట్లు నిర్ధారించారు. కుటుంబ సమ స్యలతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. పోలి కేసు నమోదు చేసిన తాలూకా పోలీసులు మృతదేహమును శవ పరీక్షల నిమిత్తం మదనపల్లి జిల్లా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

## వడపప్పు,పానకం పంపిణీ

ప్రొద్దుటూరు అర్బన్, ఏప్రిల్ 6 ప్రభాత వార్త :

సహృదయ వాకింగ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక వసంతపే టలోని గాంధీ పార్క్ ముందు ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా ప్రజలకు వడపప్పు, పానకం, పండ్లు అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సెక్ర టరీ డాక్టర్ సోదుం బాలి రెడ్డి మాట్లాడుతూ శ్రీరామనవమి,ఉగాది పండుగల సందర్భంలో వాకింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఇందులకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్య వాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు వెంకటేశ్వర రెడ్డి, గౌరవాధ్యక్షులు విశ్వనాధ రెడ్డి, ఎన్జీవో హోమ్ ప్రెసిడెంట్ కేజె రఘురామి రెడ్డి, ది బాలి రెడ్డి ప్రసాద్ రెడ్డి,శ్రీనివాసులు,నాగరాజు పాల్గొన్నారు.

## ఎస్పైని ఘనంగా సత్కరించిన టీడీపీ నాయకులు

సిద్దవటం, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:



మండల ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన మహమ్మ రఫీని ఆదివారం తెదేపా నాయకులు పోలీసు స్టేషన్ నందు శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామాల్లో ఏమైనా సమ స్యలుంటే నా దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయ తీరాజ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుప్పాల వెంకట సుబ్బయ్య, పార్లమెంటు కా ర్యదర్శి నాగ మునిరెడ్డి, యువ నాయకుడు రాజానాయుడు, సీనియర్ తెదేపా నాయకుడు చెంచయ్య నాయుడు, రా మ్మోహన్ నాయుడు, మల్లు వెంకట సు బ్బారెడ్డి, మాజీ సర్పంచ్ రాజశేఖర్ యా దవ్, పుత్తా ఎల్లయ్య పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

దువ్వూరు, ఏప్రిల్ 06, ప్రభాతవార్త:

మండల పరిధిలోని రామాలయాల్లో ఆదివారం శ్రీరామనవమి పండుగ సంధ ర్భంగా శ్రీ సీతారాముల కళ్యాణోత్సవాలను వైభవంగా నిర్వహించారు. దువ్వూ రుకు సమీపంలోని పాత దువ్వూరులో వెలసి ఉన్న శ్రీ కోదండరామస్వామి దేవాలయం నందు సీతారాముల కళ్యానోత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సంధర్భంగా ఆలయంలో పూజలు, అభిషేకాలు నిర్వహిం చారు. అలాగే ఉత్సవ విగ్రహాలను ఉంచి కళ్యాణం నిర్వహించారు. ఈ సంద ర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. దువ్వూరులోని శ్రీ రామాలయంలోను, గుడిపాడు, ఎంకుపల్లె, పెద్దజొన్నవరం గ్రామాల్లో కూడ శ్రీరామనవమి పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అన్ని చోట్ల భక్తు లకు అన్నదాన కార్యక్రమాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

## రాజంపేటలో ఆర్ఎస్ఎస్ పదసంచలనం

రాజంపేట అర్బన్, ఏప్రిల్ 06, ప్రభాతవార్త:

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ ఆధ్వర్యంలో ఆదివారం పదసంచలనం కా ర్యక్రమం జరిగింది. నూనె వారి పల్లి పల్లి సాయి విద్యాలయ పాఠశాల, సమద్ థియేటర్ నుండి ఆర్ఎస్ రోడ్డు మీదగా పాత బస్టాండ్ నుండి మెయిన్ రోడ్డు మీదగా మార్కెట్ , ప్రభుత్వ ఆసుపత్రి ఆఫీసర్స్ క్లబ్ నుండి విద్యాలయ పాఠ శాలకు చేరుకోవడం జరిగింది. ఈ సందర్భంగా విభాగ్ ప్రముఖ కే రెడ్డప్ప మా ట్లాడుతూ ప్రపంచంలో కెల్లా అతిపెద్ద దేశభక్తి కలిగి సేవ తత్పరంతో పనిచేస్తున్న ఏకైక సంస్థ ఆర్ఎస్ఎస్ అని అన్నారు. 1925 సంవత్సరంలో ప్రారంభించి నేటికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకోబోతున్న సంస్థ అని ఈ 100 సంవత్సరాల్లో దేశంలో అనేక రంగాల్లో అనేక సంస్థలను ప్రారంభించి అం దరికీ ఈ దేశంలో దేశం పట్ల దేశభక్తి ప్రేమ కలిగేటట్లు వ్యక్తిగతంగా వారికి శారీరకంగా యోగ కరసాము లాంటి ఆటపాటలతో వేలాది లక్షలాదిమంది వ్యక్తు లను తయారు చేసినటువంటి సంస్థ అన్నారు.దేశంలో ఎక్కడ ఏ విపత్తు జరిగినా అందరికంటే ముందుండి పని చేసేవారు ఆర్ఎస్ఎస్ స్వయంసేవకులని వారన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా గీతాంజలి విద్యాసంస్థల అధినే త సంభావ వెంకటరమణ, ఆర్ఎస్ఎస్ నాయకులు సుబ్రహ్మణ్యం అఖిల్, బిజెపి నాయకులు పోతు గుంట రమేష్ నాయుడు ,సాయి లోకేష్, తదితర అనేకమంది స్వయం సేవకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




## పేరు మార్పు

మహమ్మద్ నవాజ్, తండ్రి మహమ్మద్ అజ్మతుల్లా డోర్ నెం.20/920, రాధాకృష్ణ నగర్, కోఆపరేటివ్ కాలనీ, కడప టౌన్ వైయస్సార్ కడప జిల్లా, ఏపీ. మహమ్మద్ నవాజ్ (పాత పేరు), ఖాజా గరిబున్ నవాజ్, తండ్రి మహమ్మద్ అజ్మతుల్లా (కొత్త పేరు) గా మార్చుడమైనది.

## పాస్‌పోర్టు పోయినది

షేక్ మహమ్మద్ ఇమ్రాన్ తండ్రి షేక్ ఇస్మాయిల్ డి నెం. 6 /2051. కె.ఎం.హెచ్ వీధి, కడప నగరం, కడప వైయస్సార్ జిల్లా, ఏపీ. నా పాస్ పోర్ట్ నెం. R9345998 నా ఇల్లు నకాస్ నుండి మట్టి పెద్దపులి వీధిలోకి మారుతుండగా పోయినది. దొరికినచో పై అడ్రస్ కు తెలుపగలరు.

## ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

**బద్వేల్ అర్బన్ ఏప్రిల్ 06 ప్రభాతవార్త :**

శ్రీరామనవమి సందర్భంగా వాసవి క్లబ్ అధ్యక్షులు అనుమల శెట్టి సిద్దయ్య సెక్రటరీ వెంకట సందీప్ వనిత క్లబ్ అధ్యక్షురాలు చింతకుంట ధనలక్ష్మి సెక్రటరీ ఉరిమి పద్మావతిల ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు, ముందుగా మైదుకూరు రోడ్ మంచినీటి చలివేంద్రం వద్ద పలువురు ప్రజలకు వడపప్పు పానకం వితరణ కార్యక్రమాన్ని దాతలు సహకారంతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కె,వి సుబ్బారావు, మాజీ వాసవి క్లబ్ అధ్యక్షులు మేధాహల్ భార్గవ్,చాటకొండు వెంకటసుబ్బయ్య, ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు దేవతి లలిత మాట్లాడుతూ శ్రీరామనవమి పండగ పురస్కరించుకొని వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో మైదుకూరు రోడ్ మంచినీటి చలివేంద్రం వద్ద సుమారు 5,00 మందికి పైగా బెల్లం పానకం, వడపప్పు పంపిణీ చేయడం జరిగిందన్నారు, అలాగే ఆర్టిసి బస్టాండులో డిపో మేనేజర్ నిరంజన్ ఆధ్వర్యంలో పలువురు ప్రయాణికులకు పానకం, వడపప్పు పంపిణీ చేసి అనంతరం పలువురికి శ్రీరామనవమి వేడుకల విశిష్టతను వివరించడం జరిగిందని తెలియజేశారు, అనంతరం సత్య బాలాజీ బుక్ స్టాల్ యజమాని చుండూరు వెంకటరమణ చలివేంద్రం వద్ద పలువురు పాదాచార్లకు మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని ఆర్యవైశ్య వర్తక సంఘం కమిటీ మెంబర్ జొన్నలగడ్డ సుధాకర్ చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో మెంట లక్ష్మీనారాయణ, చింతకుంట సుదర్శన్ తో పాటు పలువురు పాల్గొన్నారు

## టీడీపీ సభ్యత్వంతో ప్రత్యేక గుర్తింపు



**లక్కిరెడ్డిపల్లి; ఏప్రిల్ 06, ప్రభాత వార్త**

దేశంలోనే ఎక్కువ సభ్యత్వాలు కలిగిన ఏకైక పార్టీ టీడీపీ అని, ఈ పార్టీలో సభ్యత్వం తీసుకున్న వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందని రాజంపేట డాక్టర్ సెల్ ప్రధానకార్యదర్శి, బూతు ఇంచార్జ్ ఎస్.ఎం.డి. షఫీ నాయక్ పంపిణీ పేర్కొన్నారు అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కార్యకర్తలకు అండగా చేపట్టిన ఐదు లక్షల ప్రమాద బీమా సభ్యత్వ కార్డులను రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ది, ఆయన సోదరుడు మండిపల్లి లక్ష్మీప్రసాదొడ్డి ఆదేశాల మేరకు 18వ బూతులోని కార్యకర్తలకు, తాసిల్దార్ కార్యాలయానికి వెనుక వీధిలోని కార్యకర్తలకు టిడిపి సభ్యత నమోదు కార్డులను పంపిణీ చేశామన్నారు. ప్రతి ఒక్కరూ పార్టీ సభ్యత కార్డు తీసుకున్న వారికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ అహ్మద్ ,ఈశ్వర్ భాస్కర్ పవన్ కుమార్ సుభాన్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాడవాడల శ్రీరామనవమి వేడుకలు

**కలకడ ఏప్రిల్ 6 ప్రభాత వార్త :**

శ్రీరామ నవమి వేడుకలను వాడవాడలా జరుపుకున్నారు.మండలంలోని గోపాలపురం, గువ్వలవాండ్లపల్లి, కోన, కదిరాయచెరువు, నడిమిచర్ల, పాపిరెడ్డిగారి పల్లి, ముడియంవారిపల్లి, నవాబుపేట తదితర గ్రామాలలో శ్రీరామ మందిరాలను విద్యుత్ దీపాలతాలంకరించి శ్రీరామనవమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించుకున్నారు.అనంతరం రాత్రి సీతారాముల లక్ష్మణ ఆంజనేయ స్వామి విగ్రహాలను చాందిని బండ్ల మీద ఊరేగించడం జరిగింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

## వైభవంగా శ్రీరామనవమి వేడుకలు



సాయిబాబా ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు.

**తంబళ్లపల్లె ఏప్రిల్ 6 ప్రభాతవార్త :**

మండలంలో ఆదివారం శ్రీరామనవమి పండుగను ప్రజలు వైభవంగా నిర్వహించుకున్నారు. ఉదయం తంబళ్లపల్లె రామాలయం, సాయిబాబా ఆలయం, కోసువారిపల్లి శ్రీ ప్రసన్న వెంకటేశ్వర ఆలయం, కుక్కరాజుపల్లి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, ధూప దీప నైవేద్యాలు, కర్పూర హారతులు నిర్వహించారు. ఆలయాల పరిసరాలలో వడపప్పు, పానకం, నైవేద్యం భక్తులకు పంపిణీ చేశారు. తంబళ్లపల్లె సాయిబాబా ఆలయంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఆలయాలలో రామనామ సంకీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని పలు రామాలయాలలో సీతారాముల పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో మెడికల్ సుధాకర్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ సీతారాముల వారి కళ్యాణోత్సవం

**రామసముద్రం ఏప్రిల్ 6 ప్రభాతవార్త**



మండల కేంద్రం పలు గ్రామాలలోని శ్రీ సీతా రామాలయం,ఆంజనేయ స్వామి ఆలయంలలో ఆదివారం శ్రీరామనవమి పురస్కరించుకొని తిరుమలరెడ్డిపల్లె, రామసముద్రం,ఆర్ నడింపల్లె, జంగాలపల్లి, చెంబకూరు, కేసీ పల్లె, మినికి, వనగానిపల్లె, కనగాని, ఊలపాడు, గుంతలపేట,శ్రీ సీతారాముల వారి కళ్యాణాన్ని దేవాలయాల అర్చకులు కులశేఖర్ బటర్, మణికంఠ దీక్షితులు, శంకర్ స్వామి, అనిల్ స్వామి రాముల వారి కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆర్ నడింపల్లె గ్రామం లోని రామాలయం నందు జడ్పీటీసీ సి హెచ్ రామచంద్రా రెడ్డి ఉమాదేవి గ్రామస్థులు ఆధ్వర్యంలో శ్రీ సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాలకు ఫట్టు వస్త్రములు సమర్పించి అలంకరింపజేసి శాస్త్రోక్తంగా మాంగల్య దారణ తంతును ఘనంగా నిర్వహించారు. అనంతరం తలంబ్రాలుగా పోశారు. అనంతరం భక్తులకు , బెల్లం పానకం, పెసరపప్పు, పులిహోర వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.జంగాలపల్లె లో కనులు పండువగా స్వామి వారి కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు.

## చోరీకి ప్రయత్నించిన దొంగకు దేహశుద్ధి

**గాలివీడు, ఏప్రిల్ 6(ప్రభాతవార్త):**

ఓ షాపు వద్ద ఉన్న ఫ్రిడ్జ్‌ను దొంగలించే ప్రయత్నం చేయబోయిన దొంగను స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలలోకి వెళ్లితే.. బీహార్‌కు చెందిన ఓ వ్యక్తి ఆదివారం తెల్లవారుజామున గేటు నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న ఓ దుకానం వద్ద ఉన్న ఫ్రిడ్జ్‌ను తరలించే ప్రయత్నం చేస్తుండగా చుట్టుపక్కల ఉన్న దుకాణదారులు చూసి అతనిని తాడుతో బంధించి పోలీసులకు అప్పజెప్పారు. దీంతో చుట్టూ ఉన్న స్థానిక ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. బయట రాష్ట్రాలైన బీహార్, రాజస్థాన్, ఒరిస్సా తదితర ప్రాంతాల నుండి ఉపాధి కోసం వచ్చామంటూ సంచరించ కొత్త వ్యక్తులపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.

## పశువులకు ప్రమాదభీమా చేయించాలి

**నిమ్మనపల్లె, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :**

మండలంలోని పాడి రైతులు పశువులకు ప్రమాదభీమా చేయించుకోవాలని పశువైద్యాధికారి సురేష్ పేర్కొన్నారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ పశువులు ఏదైనా ప్రమాదంలో మరణిస్తే వాటికి ప్రమాద భీమాచే లబ్దిపొందవచ్చునని తెలిపారు. ఆవుకు ప్రీమియం రూ.300లు చెల్లిస్తే మిగిలిన రూ.2 వేలను ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. ఈ భీమా కాలపరిమితి మూడేళ్ళ పాటు ఉంటుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ఘనంగా శ్రీరామనవమి ఉత్సవం

**రైల్వే కోడూరు ఏప్రిల్ 6 ప్రభాతవార్త**



మండలంలోని ఓబనపల్లి బైనపల్లి గ్రామాలలో శ్రీరామనవమి వేడుకలను అత్యంత వైభవపేతంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజాము నుండి శ్రీరాములు విగ్రహాలను అలంకరింపజేసి దేవాలయం చుట్టూ పూలమాలలతో అలంకరింపజేసి కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూటమికి సంబంధించిన నాయకులు ప్రముఖులు పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలను పొందారు. స్వామి వారి కళ్యాణం ముగిసిన వెంటనే భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి దాదాపు 11 రోజులు పాటు ఈ గ్రామాలలో స్వామివారి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ముక్క వరలక్ష్మి ఎమ్మెల్యే అరవ శ్రీధర్ గడికోట సుబ్బరాయుడు తోపాటు గ్రామానికి చెందిన ప్రముఖులను పూలమాలలతో సన్మానించారు.

## బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**మదనపల్లె, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :**



జెండావిష్కరణ చేస్తున్న దృశ్యం

పట్టణంలోని భారతీయ జనతాపార్టీ కార్యాలయ ఆవరణంలో ఆదివారం బిజెపి 46వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు సాయిలోకేష్ పాల్గొని భారతీయ జనతా పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేక్‌కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానిగా దేశ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పారన్నారు. ప్రతి ఒక్కరూ బిజెపి జెండాను ఇంటిపై ఎగురవేసి సంఘీభావం తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు చల్లపల్లి నరసింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లి ప్రశాంత్, ఆకుల క్రిష్ణమూర్తి, బర్నేపల్లి రవికుమార్, సీనియర్ నాయకులు క్రిష్ణయ్యవర్మ, పూల నాగరాజు, ఆనంద్, డిఆర్.జగదీష్, వెంకటేష్, భువనేశ్వర్‌సత్యా, రాజశేఖర్‌రెడ్డి, భగవాన్, కోసూరి భవాని, నాగరాజు, కిరణ్, వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత



భూమిపూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

**మదనపల్లె, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :**

పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. ఆదివారం రూరల్ మండలంలోని కోళ్ళబైలు కాలనీలో రూ.కోటితో సిసిరోడ్లు నిర్మాణానికి భూమిపూజచేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా అవసరాల మేరకు రాజకీయ పార్టీలకు అతీతంగా నియోజకవర్గంలో అభివృద్ది పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఇప్పటికే పల్లె పండగ పేరుతో నియోజకవర్గంలో కోట్లాది రుపాయలతో పనులు చేపట్టామన్నారు. వేసవిలో పశువుల దాహర్తి నివారణకు కూడా ఉపాధి హామీ పథకం కింద తొట్ల నిర్మాణాలు కూడా జరుగుతున్నాయన్నారు. నిమ్మనపల్లె, రామసముద్రం మార్గాల్లో డబుల్‌రోడ్డు నిర్మాణానికి కూడా త్వరలో నిధులు మంజూరు కానున్నట్లు తెలిపారు. పట్టణంలో పెండింగ్‌లో ఉన్న రోడ్లు పనులు కూడా త్వరలో చేపట్టడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా పట్టణ శివారు ప్రాంతాల్లో ప్రజలకు మౌళిక వసతుల కల్పనకే చర్యలు తీసుకొంటామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి పనిని చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ తాజ్‌మస్రూన్, టిడిపి నాయకులు శ్రీనివాసులు నాయుడు, పురుషోత్తం, సుబ్బారెడ్డి, ఆర్ఎస్.షంషీర్, బెల్లె రెడ్డిప్రసాద్, భాస్కర్ రెడ్డి, చలపతి, రఘుపతినాయుడు, రాజేష్, రెడ్డిరాయల్ పాల్గొన్నారు.

## ఐబిఎంతో మిట్స్ విద్యార్థులు ముఖాముఖి

**కురబలకోట, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :**



ప్రతినిధులతో విద్యార్థులు

ప్రఖ్యాత ఐటి సంస్థ ఐబిఎంతో మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించింది. మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన అర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్ విభాగం ఆధ్వర్యంలో సంయుక్తంగా ఈ సంస్థ తన కార్పోరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగంగా యువతకు ప్రేరణ ఇచ్చే ఉద్దేశ్యంతో సిఎస్ఆర్ శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి బెంగుళూరుకు చెందిన ఐబిఎం ట్రైనర్ సర్వేస్ పాటిల్ మాట్లాడుతూ యువతకు తాత్కాలిక పరిశ్రమ అవసరాలు సాంకేతిక నైపుణ్యాలు, మరియు ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పిస్తూ ఈ ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. భవిష్యత్తు యువత శక్తిని గట్టిగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని శిక్షణా కార్యక్రమంద్వారా అవసరమైన స్కిల్స్ నైపుణ్యాలు, స్వామర్థ్యాలు అందించగలమని తెలిపారు.ఈ కార్యక్రమంలో విభాగాపదితులు డాక్టర్ చొక్కానాదన్, పద్మా, అసిస్టెంట్ ప్రొపెసర్ ఉదయ్‌కుమార్, జగన్నాదం, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంగళ్ళులో బిజెపి ఆవిర్భావ వేడుకలు

**కురబలకోట, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :**



భారతీయ జనతాపార్టీ 45వ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని అంగళ్ళు బస్టాండులో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు చల్లపల్లె నరసింహారెడ్డి, రాజంపేట పార్లమెంటరీ జిల్లా అధ్యక్షులు సాయిలోకేష్‌లు బస్టాండులో ఆపార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి ఆధ్వర్యంలోని కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ది వైపు నడిపిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం మండల పార్టీ ప్రధాన కార్యదర్శి తిరుమల డెయిరీ కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. అధికసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా బీజేపీ పతాకావిష్కరణ

**కలికిరి, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:**



మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలి క్రాస్ నందు భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఉమ్మడి ఏపీ మాజీ సీఎం బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు కలికిరి మండల బీజేపీ అధ్యక్షులు కుమార్‌రెడ్డి(బాబురెడ్డి) ఆధ్వర్యంలో బీజేపీ పతాకం ఎగురవేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పీలేరు నియోజకవర్గం బీజేపీ సీనియర్ నాయకులు పులిరెడ్డి నరేందర్‌రెడ్డి, పల్లవలి రెడ్డప్పరెడ్డి, వ్యక్తిగత కార్యదర్శి ఎం.కృష్ణప్ప, రవీంద్రనాథ్‌రెడ్డి, శ్రీనివాసులు, నిమ్మలపల్లి పురుషోత్తం, అలకుంట్ల గణేష్, ఎం.రాజారెడ్డి, మురళీకృష్ణ, నాయకులు, కార్యకర్తలు, నల్లారి అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.

## కురబలకోటలో శ్రీరామనవమి ఉత్సవాలు

**కురబలకోట, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :**



కురబలకోట మండలంలో శ్రీరామనవమిని ప్రజలు భక్తి శ్రద్దలతో నిర్వహించారు. అంగళ్ళు గ్రామంలోని పోరెడ్డివారిపల్లె, ములకావారిపల్లె, కమతంపల్లె, కురబలకోటలోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి కళ్యాణోత్సవాలను నిర్వహించారు. పోరెడ్డివారిపల్లెలోని ఉత్సవమూర్తులను చాందినీ బండ్లపై ఏర్పాటు చేసి ఊరేగించారు. మండల కేంద్రమైన కురబలకోటలోని శ్రీకోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సింహవాహనంపై ఉత్సవ మూర్తులను పురవీధుల్లో ఊరేగించారు.

### నిందితుని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలింపు..!

**బద్వేల్ అర్బన్ ఏప్రియల్ 06 ప్రభాతవార్త :**



మునిసిపాలిటీ పరిధిలోని తెలుగు గంగ కాలనీలో కొద్ది రోజుల క్రితం జరిగిన బంగారు చోరీ చేసిన నిందితుని అదుపులోకి తీసుకొని రిమాండ్ తరలించినట్లు సీఐ రాజగోపాల్, ఎస్సైలు మాడిశెట్టి సత్య నారాయణ, రవికుమార్ లు తెలిపారు. వివరాల్లోకెళితే నెల్లూరు జిల్లా కలువాయి మండలానికి చెందిన మురళి అనే వ్యక్తి పట్టణంలో ఆటో తోలుకుంటూ సాగిస్తూ ఉండేవాడని వారు తెలిపారు . గత వారం వారంలో తెలుగుగంగా కాలనీలో ఒక ఇంట్లోకి ఎవరూ లేని సమయంలో ప్రవేశించి దాదాపుగా ఏడు తులాల బంగారు నగలను చోరీ చేసిన విషయం పాఠకులకు విధితమే . చోరీ కేసును చాలెంజిగా బద్వేల్ పోలీసులు తీసుకొని పాలిటెక్నిక్ కాలేజీ సమీపంలో నిందితుని అదుపులోకి తీసుకున్నట్లు ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్ కార్యాలయం యందు విలేకరుల సమావేశం లో అర్బన్ సీఐ రాజగోపాల్ తెలిపారు నిందితుని వద్ద ఏడు తులాల బంగారు నగలను స్వాధీన పరుచుకున్నట్లు స్వాధీన పరుచుకున్న బంగారు ఆభరణాలు విలువ దాదాపుగా 6, లక్షల రూపాయలు విలువ చేస్తుందని వారు తెలిపారు. అనంతరం నిందితున్ని రిమాండ్ తరలించినట్లు వారు తెలిపారు ఈ సమావేశంలో బద్వేల్ అర్బన్ ఎస్సైలు సత్యనారాయణ, రవికుమార్. పోలీస్ సిబ్బంది నరసింహ, మోహన్, వెంకటేష్, ఓబులేష్, కోటేశ్వరరావు మరియు పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## జమ్మలమడుగు అన్ని రంగాల్లో అభివృద్ధి

**జమ్మలమడుగు, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:**



జమ్మలమడుగు అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు బీజేపీ మరియు కూటమి ప్రభుత్వం అండగా ఉందని రాష్ట్ర ప్రభుత్వ విప్ మరియు జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం శ్రీరామనవమి మరియు బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జమ్మలమడుగులోని పార్టీ కార్యాలయం నందు బీజేపీ జెండ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో అత్యధిక పింఛన్లు ఉన్న ఏకక రాష్ట్రం ఏపీ అన్నారు. అందులో జమ్మలమడుగులో కూడా అత్యధికంగా వృద్దాప్య, వికలాంగ, వితంతు పింఛన్లు ఉన్నాయన్నారు. జమ్మలమడుగు నుంచి చెన్నై, బెంగళూరు, రాయచోటి తదితర వ్యాపార కేంద్రాలకు హైవే రోడ్లు ఉన్నాయని వ్యాపారులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధిలో ముందుకు సాగుతుందని తెలిపారు. వికసిత భారత్ ప్రధానమంత్రి, రాష్ట్ర సీఎం కృషి చేస్తున్నారని అందులో మనం కూడా భాగస్వాములు కావాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని మండల ఇన్‌ఛార్జిలు, అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలుభారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.

## వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం

**చిట్వేలి, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:**



కళ్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు.

శ్రీరామనవమి సందర్భంగా ధర్మ సంస్థాపన కొరకు త్రేతాయుగంలో చైత్ర శుద్ధ నవమి నాడు అవతరించిన శ్రీరాముని జన్మదినం వేడుకలను ఆదివారం మండల ప్రజలు అన్ని గ్రామాలలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రామాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు భక్తిశ్రద్ధలతో స్వామి వారిని దర్శించుకున్నారు. పలు గ్రామాలలో నవమి వేడుకలను తొమ్మిది రోజులు పాటు ఘనంగా నిర్వహించనున్నారు. భజనలు, ఊరేగింపు, కళ్యాణం, సాంస్కృతిక కార్యక్రమాలు,అన్నదాన వేడుకలు ఈ వేడుకల్లో ప్రత్యేకంగా నిలవనున్నాయి. ఇందులో భాగంగా స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం నందు ఆర్యవైశ్యులు ప్రత్యేక పూజలు చేసి, శ్రీ సీతారాముల వారికి కళ్యాణాన్ని చేపట్టారు. ఆలయ పెద్ద లు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు.

## నిమ్మనపల్లెలో శ్రీరామనవమి ఉత్సవాలు

**నిమ్మనపల్లె, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :**

హిందువుల పండగల్లో ముఖ్యమైన శ్రీరామ నవమి పండుగను ఆదివారం నిమ్మనపల్లె మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటి శ్రీరామనవమి ఉత్సవాలు జరుపుకోగా శ్రీనేలమల్లేశ్వరస్వామి ఆలయ నిమ్మనపల్లెలోని అభయాంజనేయస్వామి ఆలయం, అక్కగార్ల కుంట వద్ద ఆంజినేయస్వామి దేవాలయాల్లో భక్తాదులు ఘనంగా శ్రీరామనవమి ఉత్సవాలు జరుపుకొన్నారు.

## మేకల కాపరి పై అడవి పందుల దాడి

**మదనపల్లి క్రైమ్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త.**

మేకల కాపరిపై అడవి పందులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన ఆదివారం మదనపల్లె మండలంలో జరిగింది. బాధితురాలి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బొమ్మన చెరువు పంచాయితీ, టేకులపాలెంకు చెందిన గోపాల్ భార్య సుభద్ర(45) తన కొడుకు విజయకుమార్ తో కలిసి మేకలు మేపడం కోసం అడవికి వెళ్ళింది. మేకల మేపుతుండగా అడవిలో నుంచి పందులు వచ్చి ఒక్కసారిగా సుభద్రపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. కుమారుడు వాటి భారి నుండి తన తల్లిని కాపాడి వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు..

## భక్తిశ్రద్ధలతో శ్రీరామనవమి

**కలికిరి, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:**

కలికిరి పంచాయతీ పరిధిలోని శ్రీరామ నవమి భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆహ్వానం మేరకు అందే కురవపల్లికి చెందిన సిబ్బంది దినకర్ ఉత్సవాలకు తన వంతుగా ఇందిరమ్మ కాలనీకి రూ10వేలు, బండకడపల్లి గడికి రూ10వేలు అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో నిజాం వెంకట నారాయణరెడ్డి, చంద్ర, జ్ఞానమూర్తి, రమణ, శబరి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యం

**పీలేరు ఏప్రిల్ 6 ప్రభాతవార్త:**

పీలేరు పట్టణ శివారులోని కడప రోడ్డులో ఓ గుర్తు తెలియని యువకుడి మృతదేహం శుక్రవారం గుర్తించినట్లు ఎస్సై బాలకృష్ణ తెలిపారు. స్థానిక కడప రోడ్డులోని ఓ వైన్ షాప్ సమీపంలో గురువారం రాత్రి 12:40 గంటల సమయంలో ఈ వ్యక్తి మరణించి ఉంటాడని భావిస్తున్నారు. సుమారు 35 40 ఏళ్ళ మధ్య వయస్సు కలిగి ఉండి, చామన ఛాయ రంగులో ఉన్నాడని, అతని కుడి భుజంపై పచ్చబొట్టు, కుడిచేయి మణికట్టుకు ఎర్రని దారం కట్టబడి, కడియం కలిగి ఉన్నాడన్నారు. అంతేకాకుండా మరణించిన వ్యక్తి మాసిన లేత నీలి రంగు టి షర్టు, నలుపు రంగు షార్ట్ ధరించి ఉన్నాడు. ఈ ఫోటోలోని మృతుడి వివరాలు తెలిసిన వారు పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ సెల్ నెంబరు: 9440796744కు 9440796745కు అందించాలని తెలియజేశారు.

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**రాయచోటి, ఏప్రిల్ 06 ప్రభాతవార్త**



ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు ఈనెల 07న సోమవారం ఉదయం 10.00గం.ల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి తో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

## ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**మైదుకూరు, ఏప్రిల్ 06, ప్రభాతవార్త:**



భారతీయ జనతా పార్టీ బిజెపి కార్యాలయంలో అసెంబ్లీ కన్వీనర్ మాచనూరు సుబ్బరాయుడు, మండల అధ్యక్షుడు వడ్ల దేవేంద్ర ఆధ్వర్యంలో ఘనంగా వ్యవస్థాపక దివస్ బిజెపి వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించడం జరిగింది. అనంతరం బిజెపి జెండాను ఎగరవేసి మిఠాయిలు పంచి నరేంద్ర మోడీ నాయకత్వం వర్ధిల్లాలి భారత్ మాతాకీ జై అంటూ నినాదాలతో దేశ సేవకు పునరా అంకితం అవుదామంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అసెంబ్లీ కన్వీనర్ మాచనూరు సుబ్బరాయుడు మాట్లాడుతూ బిజెపి కార్యకర్తగా ఉన్నందుకు ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, చాపాడు మండల అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, రాజమోహన్ రెడ్డి, నరేష్, రవికళ్యాణ్, చాపాడు మాజీ మండల అధ్యక్షుడు చంద్ర, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య,మండల జనరల్ సెక్రటరీ సుబ్బరామిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గురు మహేశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు బొగ్గుల చంద్ర, ఓబుల్ రెడ్డి, మండల కార్యదర్శి జనార్ధన్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నందివర్ధనా చారి తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు ఎర్రచందనం దుంగలు, కారు స్వాధీనం

**రాజంపేట అర్బన్, ఏప్రిల్ 5 ప్రభాతవార్త**



రాయచోటి – గడికోట మార్గంలో అక్రమంగా రవాణా చేస్తున్న నాలుగు ఎర్రచందనం దుంగలు, కారును స్వాధీనం చేసుకుని ఒక స్మగ్లర్‌ను టాస్క్ ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. ఆర్ఎస్ఎస్టీఎఫ్ చీఫ్ ఎల్. సుబ్బారాయుడు ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ. శ్రీనివాస్ అధ్వర్యంలో డీఎస్పీ బాలిరెడ్డి ,ఆర్ఐ సాయి గిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ సి. వినోద్ కుమార్ టీమ్ శనివారం తనిఖీలు చేపట్టింది. రాజంపేట డివిజన్ సానిపాయ రేంజిలోని వీరబల్లి ఫారెస్టు బీటు పరిధిలో స్థానిక ఎఫ్బీఓ జి. అనిల్ కుమార్ తో కలసి కూంబింగ్ చేపట్టారు. తరువాత రాయచోటి – గడికోట మార్గంలో వాహనాలను తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో ఒక కారు వేగంగా రావడంతో అప్రమత్తమైన టాస్క్ ఫోర్సు పోలీసులు కారును ఆపేందుకు ప్రయత్నించారు. కారు ఆగకుండా వెళ్లడంతో టాస్క్ ఫోర్సు పోలీసులు వెంబడించి వాహనాన్ని అటకాయించారు. దీంతో కారులో ఉన్న వ్యక్తి దిగి పారిపోయే ప్రయత్నం చేయగా, చుట్టుముట్టి పట్టుకున్నారు. కారులో చూడగా నాలుగు ఎర్రచందనం దుంగలు లభించాయి. కారులోని వ్యక్తిని అరెస్టు చేసి, కారుతో సహా ఎర్రచందనం దుంగలను తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషనుకు తరలించారు. డీఎస్పీ శ్రీనివాసులు రెడ్డి సమక్షంలో సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## తరలిన వేలాది మంది భక్తులు

**లక్కిరెడ్డిపల్లె ; ఏప్రిల్ 06, ప్రభాత భర్త**



మండలంలోని శ్రీ శ్రీ అనంతపురం గంగమ్మ తల్లికి వేలాది మంది భక్తులు ఆదివారం బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించి తమ మొక్కులు తీర్చుకున్నార ఆదివారం కావడంతో గ్రామ బోనాలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల కు చెందిన భక్తులే కాకుండా వివిధ ప్రాంతాల నుండి వేలాది మంది భక్తులు ఆలయంకి తరలి రావడంతో అమ్మవారి దర్శనం కోసం తెల్లవారుజాము నుండే క్యూ లైన్లో భక్తులు వేచి ఉండాల్సి వచ్చింది. లక్కిరెడ్డిపల్లె పోలీసులు తో పాటు ఆలయ ప్రత్యేక అధికారి శ్రీనివాసులు, ఆలయ పూజారులు చెల్లు గంగన్న సురేంద్ర యోగాంజనేయులు, రామచంద్ర భక్తులకు అమ్మవారి దర్శనాన్ని కల్పించే విధంగా చొరవ చూపుతూ అమ్మవారి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఆలయ ప్రాంగణం చుట్టూ శీతల పానీయాలు అంగళ్లు, మిఠాయి కొట్టులు, అత్యధికంగా చెరుకుల బండ్లు ఆలయం ప్రాంగణం కి చేరుకోవడంతో చిన్నపాటి జాతరను తలపించింది.ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో భక్తులకు చలువ పందిళ్లు ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు సిబ్బంది, వేలాది మంది భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాములవారి కళ్యాణం

**కాశినాయన, ఏప్రిల్6, ప్రభాత వార్త**

మండలంలోని పలు గ్రామాలలో శ్రీరామనవమిని పురస్కరించుకొని రాముల వారి కళ్యాణవోత్సవాలు ఘనంగా నిర్వహించారు .ఉదయం 5గంటలనుంచి భక్తాదులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం సీతారాముల కల్యాణం కనువిందుగా నిర్వహించారు. సాయంత్రం 4గంటలనుంచి సీత రాముల విగ్రహాలను భక్తి శ్రద్ధలతో పుర వీధులగుండా ఊరేగింపు నిర్వహించారు. నరసాపురం, మిద్దెల, వరికుంట్ల సావిసెట్టిపల్లి ,అమగంపల్లి, తదితర గ్రామాలలో నిర్వహించారు. ఈ కార్యకమంలో భక్తాదులు పాల్గొన్నారు.

## వడ పప్పు,పానకం పంపిణీ

**పులివెందుల, ఏప్రిల్ 6, ప్రభాత వార్త:**



వడపప్పు పానకం పంపిణీ చేస్తున్న దృశ్యం

శ్రీరామ నవమి పండుగ పర్వదినం సందర్భంగా పులివెందుల పట్టణంలోని శ్రీరామ హాల్ రోడ్ లోని సాయి శ్రీ ఫిజియోథెరపీ అండ్ రిహబిలేషన్ సెంటర్ డాక్టర్ వెంకట సాయి కిషోర్ ఆధ్వర్యంలో వడపప్పు పానకం పంపిణీ చేశారు.ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు డాక్టర్ వెంకట సాయి కిషోర్ కుటుంబ సభ్యులు ప్రజలకు వడపప్పు, పానకంను అందించారు.

## శ్రీరామనవమి సందర్భంగా అన్నదానం

**ప్రొద్దుటూరు ఏప్రిల్ 6 ప్రభాతవార్త**

శ్రీరామనవమి సందర్భంగా ప్రొద్దుటూరు బొల్లవరంలో స్వర్గీయ పుల్లారెడ్డి నిర్మించిన సీతారాముల దేవాలయం నందు శ్రీరామనవమి సందర్భంగా పోరెడ్డి నరసింహారెడ్డి మరియు వారి కుమారులు పోరెడ్డి సందీప్ రెడ్డి పోరెడ్డి ప్రదీప్ రెడ్డి మరియు వారి కుటుంబ సభ్యులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు అక్కడికి విచ్చేసిన భక్తాదులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రొద్దుటూరు మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు రెడ్డి మరియు మున్సిపల్ కౌన్సిలర్ పాతకోట వంశీధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు భక్తులు పాల్గొన్నారు.



## సీతారాముల కల్యాణానికి ముత్యాల తలంబ్రాలు తయారీ ప్రారంభం


సీతారాముల కల్యాణానికి వినియోగించే తలంబ్రాలకు హారతి ఇస్తున్న అర్చకులు


తలంబ్రాలను ప్యాకింగ్ చేసేందుకు వచ్చిన శ్రీవారి సేవకులు

**రాజంపేట అర్బన్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త**

ఒంటిమిట్ట శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏప్రిల్ 11న జరుగనున్న శ్రీ సీతారాముల కల్యాణం కోసం ఆలయంలో ఆదివారం తలంబ్రాల తయారీ శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 11న జరగనున్న శ్రీ సీతారాముల కల్యాణోత్సవంలో ఎంతో ప్రాముఖ్యత ఉన్న ముత్యాల తలంబ్రాల ప్యాకింగ్ కార్యక్రమం శ్రీవారి సేవకులతో టీటీడీ ప్రారంభించింది. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపుగా కల్యాణవేదిక వద్ద గల పిఏసి వద్దకు తీసుకొచ్చారు. శ్రీ సీతా రామ కళ్యాణం కోసం తలంబ్రాల తయారీకి అవసరమయ్యే పసుపు వినియోగించేందుకు ఏప్రిల్ 3న పుసుపు దంచే కార్యక్రమం నిర్వహించారు. ఇక్కడి హాలులో బియ్యం, పసుపు, నెయ్యి కలిపి తలంబ్రాలు తయారు చేసి, తలంబ్రాలతో పాటు ముత్యం, కంకణం ఉంచి ప్యాకెట్లను సిద్ధం చేస్తున్నారు. కడప, అన్నమయ్య జిల్లాల నుండి శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో సేవలందించేందుకు శ్రీవారి సేవకులు వచ్చారు. దాదాపు 425 మంది శ్రీవారి సేవకులు లక్షకు పైగా తలంబ్రాల ప్యాకెట్ల తయారీలో పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఈవో ప్రశాంతి, పిఆర్ఓ (ఎఫ్ఏసి) కుమారి నీలిమ, ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్స్పెక్టర్ నవీన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా సీతారామ కళ్యాణోత్సవము

**లక్కిరెడ్డిపల్లె; ఏప్రిల్ 06, ప్రభాతవార్త**

శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాలలో శ్రీ శ్రీ సీతారామ కళ్యాణోత్సవమును ఆదివారం గ్రామ ప్రజలు, భక్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. లక్కిరెడ్డిపల్లె టౌన్ పరిధిలోని రామాలయంలో అర్చకులు వెంకట నారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణోత్సవమును ఘనంగా నిర్వహించారు. స్వామివారికి పట్టు వస్త్రాలతో అలంకరించి కళ్యాణోత్సవ కార్యక్రమాన్ని భక్తుల కోలాహాలం నడుమ ఘనంగా నిర్వహించారు. పానకం, వడపప్పును స్వామీ వారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులను పురవీధులలో బాణా సంచ నడుమ అంగరంగ వైభవంగా ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు వడపప్పు, పానకంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. చింతకుంట వాండ్లపల్లె, కోనంపేట, దిన్నపాడు, మద్దిరేవుల తదితర గ్రామాలలో శ్రీ సీతా రామ కళ్యాణంను నిర్వహించారు. భక్తులకు వడపప్పు, పానకమును అంద



జేసి, దాతల సహకారంతో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీ రామాలయ కమిటీ వారు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేస్తూ స్వామివారి దర్శనాన్ని కల్పింప చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అంతా రామ రామ శ్రీరామమయం


ప్రత్యేక అలంకరణలో శ్రీ కోదండరామ స్వామి మూల విరాట్


రాములవారి కళ్యాణంకు హాజరు అయిన భక్తులు

**పులివెందుల,ఏప్రిల్6, ప్రభాత వార్త:**

పట్టణంలోని శ్రీరామనామ నవమి పండుగను పురస్కరించుకుని నవమి వేడుకలు వాడ వాడలా ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. రామ రామ శ్రీరామమయం అంటూ జపములతో రామ మందిరాలు ఆంజనేయస్వామి దేవస్థానాలు మారు మ్రోగిపోయాయి. శ్రీరామనవమి పండుగ సందర్భంగా వాడ వాడలా సీతారాముల చిత్రపటాలను ఉంచి ప్రత్యేక పూజలు చేసి పానకం, వడపప్పు పంపిణీ చేశారు. శ్రీరామ.. జయ రామ.. జయ జయ రామ అంటూ తమ భక్తిని చాటుకున్నారు. పట్టణంలోని నగరి గుట్ట వద్ద వున్న కోదండ రామస్వామి ఆలయం,భద్రాది రామాలయం (గీతామందిరం) లో సీతారాముల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించా రు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. రీడింగ్రూమ్ వీధిలో ఉన్న రామాలయంలో సీతారాముల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు పానకం, వడపప్పు ప్రసాదాన్ని పంచిపెట్టారు. గాడిచర్ల వీధిలో ఉన్న భజనమందిరంలో సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే ఆంజనేయస్వామి ఆలయం, తూర్పు, పడమటి ఆంజనేయస్వామి, కోతి సమాధి, షిర్డిసాయిబాబా ఆలయాలతోపాటు తదితర ఆలయాల్లో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.పట్టణంలోని పలు ఆలయాల యందు వైఎస్ఆర్ సీపీ మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి,తుంగభద్ర కెనాల్ నీటి సంఘం ఛైర్మెన్ తెదేపా నాయకులు మారెడ్డి జోగి రెడ్డి వారి వారి అనుచరులతో కలిసి సీతా రాములను దర్శించుకున్నారు.

**కమనీయంగా సీతారాముల కల్యాణం**

శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా స్థానిక నగరిగుట్ట శ్రీకోదండరామ స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని కమనీయంగా జరిపించారు. ఆర్చకులు మురళీ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా బాజా భజంత్రీల మధ్య భక్తుల నడుమ శ్రీసీతారాముల కల్యాణం కమనీయంగా నిర్వహించారు. అలాగే పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీరంగనాథస్వామి ఆలయ ఛైర్మన్ సుద్దీకరెడ్డి ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. పురోహితులు సీతారాముల కల్యాణం విశిష్టతను వివరిస్తూ కల్యాణం తిలకించిన వారికి భోగ భాగ్యాలు కలిగి సుఖసంతోషాలతో ఉంటారని వివరించారు.

## కోదండరాముని దర్శించుకున్న ఎమ్మెల్యే


హారతి అందుకుంటున్న పీలేరు ఎమ్మెల్యే

**పీలేరు ఏప్రిల్ 6 ప్రభాతవార్త :**

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పీలేరు నియోజకవర్గ శాసన సభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి పట్టణంలోని శ్రీ కోదండరామ స్వామిని దర్శించుకున్నారు. ఆదివారం శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా ఎమ్మెల్యే స్థానిక ప్రకాశం రోడ్డులో, సదుం రోడ్డులోని రామాలయాలను దర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సాంప్రదాయ పద్ధతిలో పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ లోక కళ్యాణార్థమై ఎన్నో త్యాగాల కోర్చిన సీతారాముల పవిత్ర బంధం ఆదర్శనీయ మైనదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాలు, మహిళలు, నల్లారి అభిమానులు పాల్గొని ఆయనతో పాటు దైవ దర్శనం చేసుకున్నారు.

## ముత్యాల తలంబ్రాలు సమర్పించిన ఎమ్మెల్యే వరద



**ప్రొద్దుటూరు, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:**

పట్టణం కోనేటి కాల్వ వీధిలో వెలిసిన శ్రీ సీతారాముల దేవాలయం ఆవరణలో శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా ఆదివారం నిర్వహించారు. కళ్యాణ మహోత్సవానికి అధిక టిడిపి నాయకులు దుగ్గిరెడ్డి రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో ముత్యాల తలంబ్రాలను స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి చేతుల మీదుగా సమర్పించారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీరాముల పేటలోని ఆయన ని వాసం నుండి ముత్యాల తలంబ్రాలు తీసుకొని కోనేటి కాల్వ వీధిలోని శ్రీ సీతారాముల దేవాలయం దగ్గరికి నడుచుకుంటూ వెళ్ళి సీతారాముల వారికి ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మాజీ కౌన్సిలర్ ఘంటసాల సావిత్రమ్మ, తెదేపా మాజీ పట్టణ అధ్యక్షుడు ఘంటసాల వెంకటేశ్వర్లు, ఘంటసాల శ్రీనివాసులు, ఘంటసాల అనిల్, తెదేపా నాయకులు సుధాకర్ రెడ్డి, కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రా రెడ్డి, కౌన్సిలర్లు వంగనూరు మురళీధర్ రెడ్డి, మునీర్, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు, మాజీ కౌన్సిలర్ తలారి పుల్లయ్య, రామాంజనేయులు రెడ్డి, చీమల రాజశేఖర్ రెడ్డి, గంజికుంట ఆంజనేయులు, చిలకల కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## జై శ్రీరామ్ నినాదాలతో మార్మోగిన పీలేరు, గర్నిమిట్ట



**పీలేరు,,కంభం వారి పల్లి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:**

అన్నమయ్య జిల్లా, పీలేరు సదుం రోడ్డు, ప్రకాశం రోడ్లో వెలసిన శ్రీ సీతా రాములు ఆలయాలు విద్యుత్ దీపాలతో అలంకరించి ఉత్సవ మూర్తులు కు వేదమంత్రోచ్చారణ వేద పండితులు అంగరంగ వైభవంగా కళ్యాణోత్సవం నిర్వహించారు ముందుగా హిందూ ప్రజానీకం బైక్ ర్యాలీ నిర్వహించి జైశ్రీరామ్ నినాదాలతో ఆలయాల నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కంభం వారి పల్లి మండలంలోని గర్నిమిట్ట గ్రామ దేవత శ్రీ యల్లమ్మ తల్లి పాదాల చెంత నుండి మొట్టమొదటిసారిగా శ్రీరామనవమి సందర్భంగా సమరత ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీరామ శోభాయాత్ర ఘనంగా ప్రారంభించబడింది. ఈ శోభాయాత్ర గ్రామ భక్తుల సమూహం"జై శ్రీరామ్" నినాదాలతో మారుమోగుతూ, శ్రీ యల్లమ్మ తల్లి ఆలయం నుంచి ప్రారంభమై నూతనంగా నిర్మాణంలో ఉన్న శ్రీ శివాలయం వరకు శ్రద్ధాభక్తులతో సాగింది. ఈ సందర్భంలో పాల్గొన్న భక్తులు శ్రీరాముని మహిమలను, ఆయన జీవన విధానాన్ని స్మరించుకుంటూ, హిందూ ధర్మాన్ని ఆదర్శంగా అనుసరించాల్సిన అవసరాన్ని హృదయపూర్వకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ నిర్వాహకులు సమరత ఫౌండేషన్ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, పిల్లలు పాల్గొని భక్తిశ్రద్ధలతో శ్రీరాముని పట్ల తమ భక్తిని చాటారు.

## వైభవంగా శ్రీరామనవమి ఉత్సవం

**రాజుపాళెం,ఏప్రిల్06,ప్రభాతవార్త.**





మండల పరిధిలోని గ్రామగ్రామానా శ్రీరామనవమి పండుగ సందర్భంగా పలు గ్రామాలలో శ్రీరామాలయాలలో ప్రత్యేక పూజలు, కళ్యాణం, ఊరేగింపులు, భజనలు అన్నదాన కార్యమ్రాలు ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కొ ర్రపాడు గ్రామంలో జీర్ణోద్ధరణ గావించి నూతనశోభను సంతరించుకున్న శ్రీరామాలయంలో ప్రత్యేక పూజలు, స్వామివారి కళ్యాణం, గ్రామోత్సవం, అన్నదాన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈవిధంగా గ్రామగ్రామానా వాడవాడలలో వెలసిన శ్రీరాముని ఆలయాలలో పండుగ సందర్భంగా పూజలు, భజనలు, నిర్వహించారు. వెల్లాల పుణ్యక్షేత్రంలోని శ్రీసంజీవరాయస్వామి, శ్రీచెన్నకేశవ స్వామి, శ్రీభీమలింగేశ్వరస్వామి ఆలయాలలో వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని ప్రజలు శ్రీరామనవమి పర్వదినం ను భక్తిశ్రద్దలతో జరుపుకున్నారు.

## ఘనంగా శ్రీరామ నవమి జన్మదిన వేడుకలు



**జమ్మలమడుగు, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:**

జమ్మలమడుగు పట్టణంలోని నేతాజి నగర్ కాలనీలో వెలసిన శ్రీ కోదండ రామాలయంలో ఆదివారం శ్రీరామనవమి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పట్టణ కూటమి నాయకులు గోన పురుషోత్తంరెడ్డి, ప్రముఖ కాంట్రాక్టర్ జగన్మోహన్‌రెడ్డిలు సతీసమేతంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీరాములవారి కల్యాణం అనంతరం ఉత్సవ విగ్రహాలను పురవీధుల గుండా ఊరేగించగా కార్యక్రమానికి పెద్ద ఎత్తున స్థానిక ప్రజలు, మహిళలు హాజరై కన్నుల విందుగా శ్రీరాముల కల్యాణం వీక్షించి కాయ, కర్పూరాలు సమర్పించారు. ఈ ఊరేగింపులో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. దశాబ్దన్నర కాలం నుంచి శ్రీరామ నవమి నాడు ఈ కోదండ రామాలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అయితే ఈ ఏడాది దాదాపు 3వేల మంది ప్రజలు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ జగన్మోహన్‌రెడ్డి, కమిటీ మెంబర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది మురళీధర్‌రెడ్డి, అలాగ కనీవినీ ఎరుగని రీతిలో మహిళలు, పిల్లలు, వృద్ధులు పాల్గొన్నారు.

## ఘనంగా సీతారాముల కల్యాణం



**ముద్దనూరు,ఏప్రిల్ 6, ప్రభాతవార్త:**

మండలంలోని రాజుల గురవాయపల్లె గ్రామంలో శ్రీ సీతారాముల ఆలయ ప్రాంగణంలో శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా ఆదివారం నాడు సీతారాముల వారి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని పెద్దలు, పిల్లలు స్వాముల వారి కళ్యాణం లో పాల్గొన్నారు. ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి పాడిపంటలతో వర్షాలు బాగా పడి పంటలు బాగా పండాలని ఆ సీతారాములను వేడుకున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.వివాహ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆలయ కమిటివారు మధ్యాహ్నం భక్తులకు భోజన ఏర్పాట్లు చేశారు.చుట్టుపక్కల గ్రామాల వారు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

## అంగరంగ వైభవంగా సీతారాముల కల్యానం



**గాలివీడు, ఏప్రిల్ 6(ప్రభాతవార్త):**

శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకుని మండల కేంద్రంలోని గేటు శ్రీ రామాలయ దేవస్థానంలో పక్కిరెడ్డిగారిపల్లె రామాలయంలో వేదపండితులు నాగఫణికిశోర్‌శర్మ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకుని ముందుగానే గ్రామాల్లో ఉన్న ఆలయాలను శుద్ధిచేసి మామిడి తోరణాలతో, పచ్చని పందిళ్లతో అలంకరించడంతో ఆలయ ప్రాంగణంలో కళకళలాడాయి. ఆదివారం తెల్లవారుజామున నుంచి అర్చకులు ఆలయాల్లో కొలువుదీరిన సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వాములకు అభిషేక పూజలు చేసి నూతన వస్త్రాలు ధరింపజేసి వివిధ రకాల పూలమాలలతో అలంకరించారు. అనంతరం నైవేద్యం హారతులు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అర్చక స్వాములు నిర్ణయించిన కళ్యాణ ముహూర్తపు సమయానికి కళ్యాణానికి సిద్ధం చేసిన స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను కళ్యాణ వేదికలపై ఆసీనులను చేశారు. అనంతరం పెళ్లి తంతును సంప్రదాయబద్ధంగా కంకణధారణ, జీలకర్ర, బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల కార్యక్రమాలను నిర్వహించారు. మండల కేంద్రంలోని రామాలయాలలో సీతారాముల కల్యాణం అనంతరం భక్తులకు స్వామి అమ్మవార్ల దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. మండలంలోని గోరాన్‌చెరువు, బీసీ కాలనీ, కరిమిరెడ్డిగారిపల్లి, చక్కావాండ్లపల్లె, అన్ని గ్రామాల్లో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు.

## శ్రీరాముని కళ్యాణం కమనీయం



**తొండూరు ఏప్రిల్ 6 ప్రభాతవార్త):**

స్థానిక తొండూరు మండలంలోని పాటిమీద వెలసిన సీతారాముల కళ్యాణము ఘనంగా జరిగినది అదేవిధంగా మండలంలోని ఉడవగండ్ల, బూచుపల్లి తదితర గ్రామాలలో సీతారాముల కల్యాణము ప్రజలు నిర్వహించడం జరిగింది. రాముల గుడి వద్ద వడపప్పు పానకము చుట్టుపక్కల నుండి వచ్చిన పిల్లా పెద్దలకు పంచడం జరిగింది. అనంతరంస్వామివారికి కాయ కర్పూరం సమర్పించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అన్నదానమును స్వీకరించారు. సాయంకాల సమయంలో గుడి వద్ద ట్రాక్టర్ రివర్స్ పందెము లో 14 మంది పాల్గొనగా ఫస్ట్ విజేతగా పేరం రామిరెడ్డి నిలిచారు వారికి మొదటి బహుమతిగా 3000 రూపాయలు అందజేయడం జరిగింది రెండో విజేతకు 2000 అందించారు. అనంతరం స్వామివారిని గ్రామంలో గ్రామోత్సవ కార్యక్రమంలో కేరళ వాయిద్యాలు, కోలాటంల మధ్య ఊరేగింపుగా చేయడం జరిగింది.

## శ్రీరామనవమి ఉత్సవంలో డిప్యూటీ కలెక్టర్

**తంబళ్లపల్లె ఏప్రిల్ 6 ప్రభాతవార్త :**

తంబళ్లపల్లె మండలం కోటకొండ లో జరిగిన శ్రీరామ నవమి ఉత్సవాలలో రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హెచ్ ఓ డి డిప్యూటీ కలెక్టర్ మధుసూదన్ తన కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. ఆయన స్వస్థలం కోటకొండ గ్రామం కావడంతో స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, ధూప దీప నైవేద్యాలు సమర్పించి అనంతరం శ్రీరామనవమి సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొని వారిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలికి సత్కారం చేశారు. ఈ కార్యక్రమాలలో డిప్యూటీ కలెక్టర్ మధుసూదన్ తండ్రి రామచంద్ర, గ్రామంలోని ప్రజాప్రతినిధులు, అన్ని పార్టీల నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని సంతోషంగా శ్రీరామనవమి వేడుకలు జరుపుకోవడం విశేషం.

## ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

**మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**



**చిన్నమండెం, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :**

వివిధ శాఖల అధికారులు ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి న్యాయం చేయాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మంత్రి తమ నివాసం నందు మంత్రి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వివిధ సమస్యలపై ఎన్నో వ్యయ ప్రయాసాలకోర్చి తమ సమస్యల పరిష్కారానికి అధికారుల దగ్గరికి రావడం జరుగుతుందని అధికారులు బాధితుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని అప్పటికప్పుడే వారి సమస్యలు పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా మంత్రి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల సమస్యలను అర్జీ రూపంలో స్వీకరించి వాటిని పరిష్కరించడం జరిగింది.

## ప్రజాదర్బార్‌కు విశేష స్పందన



**రాయచోటి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త**

మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదివారం రాయచోటి పట్టణంలోని తమ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు విశేష సంఖ్యల హాజరై తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో ఎక్కువగా భూ సమస్యలు ఉన్నాయని ప్రజలు సమర్పించే అర్జీలలో ఎక్కువ శాతం భూములకు సంబంధించిన సమస్యలు ఉన్నాయన్నారు. భూ సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపి సమస్యల పరిష్కరించాలన్నారు. రాబోయే రోజులలో జిల్లాలో శాశ్వత భూ సమస్యల పరిష్కారానికి ప్రతి అధికారి ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించడం జరిగింది.

## అంగరంగ వైభవంగా సీతారాముల వారి కళ్యాణం



**మైదుకూరు, ఏప్రిల్ 06, ప్రభాతవార్త:**

శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా పట్టణంలోని నంద్యాల రోడ్డు శ్రీ రాముల వారి దేవస్థానంలో సీతారాముల వారికి అంగరంగ వైభవంగా కళ్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులకు వడపప్పు పానకం అందజేశారు. అనంతరం శ్రీరాముడు గురించి భక్తులకు పెద్దలు వివరిస్తూ లోక కళ్యాణం కోసం శ్రీ మహావిష్ణువు ధరించిన అవతారాల్లో పరిపూర్ణ మానవ అవతారమే శ్రీరామ అవతారం. లోకానికి ఆదర్శ పురుషుడు శ్రీ రామచంద్రుడు. రాజు అంటే ఎలా ఉండాలో లోకానికి స్వయంగా చూపించిన మహారాజు శ్రీరాముడు. చైత్రశుద్ధ నవమి రోజున శ్రీరాముడు జన్మించాడు కాబట్టి ఆ ఆదర్శ పురుషుని జన్మదినమే శ్రీరామనవమిగా మనం జరుపుకుంటాం. అదే రోజున మనం సీతారాముల కళ్యాణాన్ని అంగరంగవైభవంగా జరుపుకుంటున్నాం. అభిజిత్ లగ్నంలో అనగా సరిగ్గా మధ్యాహ్నం 12 గంటల సమయంలో సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా జరుపుకున్నాం. అభిజిత్ లగ్నంలో సుముహూర్తం శ్రీరాముని కళ్యాణం సీతమ్మవారితో జరపడానికి ఏడాది మొత్తం భక్తులంతా ఎంతో ఉత్సాహంగా ఎదురు చూస్తారు. ఊరంతా పందిరి వాడవాడల్లో కళ్యాణం ఉరూరా, వాడవాడల్లో చలువ పందిళ్లు వేసి సీతారాముల కళ్యాణం అంగరంగ వైభోగంగా జరిపించారు. రాములోరికి ఇవే ప్రసాదాలు ప్రతి తెలుగింటి లోగిళ్లలో శ్రీరామునికి వడపప్పు, పానకం, చెరుకు ముక్కలు, మామిడి పండ్లు వంటివి నైవేద్యంగా సమర్పిస్తారు. వేసవి ఆరంభంలో వచ్చే శ్రీరామనవమి పండుగకు ఇలాంటి నైవేద్యాలు సమర్పించి వాటిని ప్రసాదంగా మనం స్వీకరించడం వల్ల శరీరంలో వేసవి తాపం తగ్గుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ భక్తులు, పట్టణవాసులు, మహిళలు, కుటుంబ సమేతంగా పాల్గొని శ్రీరాముల వారి కళ్యాణ మహోత్సవాన్ని తిలకించి ఆనందించారు.అనంతరం భక్తులందరికీ భోజన ఏర్పాటు చేశారు.

## ప్రేమించిన అమ్మాయి ఆత్మహత్యకు పూనుకోవడం ప్రేరేపణ కాదు

**(ప్రేమ విఫలమైన వ్యాజ్యములో సుప్రీం కోర్టు తీర్పు)**

**బద్వేలు లీగల్, ఏప్రిల్ 06 ప్రభాతవార్త :**

కుమారుని ప్రేమ వ్యవహారాన్ని తల్లి ఒప్పుకోకపోవడం అనేది అతడిని ప్రేమించిన అమ్మాయి ఆత్మహత్యను ప్రేరేపించినట్లు కాదని సుప్రీం కోర్టు పేర్కొంది. "ఐపిసి సెక్షన్-306 క్రింద అభియోగాలను మోపాలంటే ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తిపై వేధించే వాతావరణాన్ని సృష్టించే చర్యలు అవసరము" అని సుప్రీం కోర్టు ధర్మాసనం జనవరి 21వ తేదీన ఇచ్చిన తీర్పులో విశదపరిచింది. అనేక న్యాయస్థానాల తీర్పులను పరిశీలించిన తరువాత తాము హైకోర్టు, ట్రయల్ కోర్టుతో ఏకీభవించలేక పోతున్నామని ఛార్జి షీట్ సాక్షుల వాంగ్మూలాలతో సహా రికార్డులలో వున్న అన్ని ఆధారాలు సరైనవని తీసుకున్నప్పటికీ అప్పీలుదారుకు వ్యతిరేకంగా ఎటువంటి సాక్ష్యాలు లేవని ధర్మాసనం పేర్కొంటూ ఓ వ్యాజ్యంలో బాబూ దాస్‌తో సంబంధాన్ని ముగించాలని, మృతురాలిపై అతని తల్లి గానీ, ఆమె కుటుంబం గానీ ఏలాంటి ఒత్తిడి తీసుకురాలేదని కోర్టు గుర్తించింది. వాస్తవానికి ఈ సంబంధాన్ని మరణించిన అమ్మాయి కుటుంబమే వ్యతిరేకించినట్లు తెలిపింది. కలకత్తా హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులకు వ్యతిరేకంగా లక్ష్మీదాస్ దాఖలు చేసిన అప్పీలును కోర్టు అనుమతించింది. అంతకు ముందు హైకోర్టు ఉత్తర్వులలో తన కుమారుడు ప్రేమ వ్యవహారాన్ని ఒప్పుకోకపోవడంతో అమ్మాయి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆరోపించిన ఛార్జిషీట్‌ను కొట్టివేయాలని ఆమె చేసిన వినతిని తిరస్కరిస్తూ ప్రేమ విఫలమైన వ్యాజ్యములో సుప్రీం కోర్టు ఈ తీర్పును వెలువరించింది.

## వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

**వీరపునయునీపల్లి,ఏప్రిల్6, ప్రభాతవార్త:**



మండలంలోని అన్ని గ్రామాలలో శ్రీరామనవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు ఉదయం నుంచి అభిషేక కార్యక్రమాలు అనంతరం కళ్యాణం కార్యక్రమాలను నిర్వహించారు అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు సాయంత్రం డప్పు వాయిద్యాలు కోలాటాల మధ్య ఎంతో వైభవంగా గ్రామోత్సవాలను నిర్వహించారు శ్రీరామనవమి వేడుకలను నిర్వహించారు.